


పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు



సంపుటి : 13 సంచిక : 80 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు (ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం ఆదివారం 22 నవంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :13 ISSUE :80 PAGES :8 EDITOR : G. A. RAO (ANAND GANTYADA) PUBLISHED : VISAKHAPATNAM SUN 22 NOVEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur



2027 గోదావరి పుష్కరాలకు భారీ ప్లాన్!

- జూన్ 26 నుంచి జూలై 7 వరకు పుష్కరాలు
- 10 కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా
- ఏర్పాట్ల కోసం రూ.3,723 కోట్ల ప్రతిపాదనలు
- 4,000 బస్సులు.. 1,560 ప్రత్యేక రైళ్లు
- 440 ఘాట్ల వద్ద విస్తృత సదుపాయాలు
- 135 భాషల్లో ఏఐ చాట్‌బాట్ సేవలు
- పుష్కరాలకు ముందే పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయాలని సీఎం లక్ష్యం

పెన్ పవర్ డెస్క్: 2027లో నిర్వహించనున్న గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. 2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు 12 రోజుల పాటు ఈ పుష్కరాలు జరగనున్నాయి. ఈ పవిత్ర మహోత్సవానికి దేశవిదేశాల నుంచి సుమారు 10 కోట్ల మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

రూ.3,723 కోట్లతో అభివృద్ధి పనులు

పుష్కరాల నిర్వహణ నిమిత్తం మొత్తం 22 శాఖల పరిధిలో రూ.3,723.69 కోట్ల అంచనా వ్యయంతో 4,862 పనులకు సంబంధించిన ప్రతిపాదనలను అధికారులు సిద్ధం చేశారు. వీటిలో ఇప్పటికే రూ.2,051.70 కోట్ల విలువైన 2,260 పనులకు ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ప్రస్తుతం దాదాపు రూ.649.70 కోట్ల విలువైన 659 పనులు ప్రారంభం

- మిగతా 2లో



ఆసియాలోనే అతి పెద్ద రిలయన్స్ పానీయాల ఫ్యాక్టరీ..

ఓర్వకల్లు వేదికగా కాంపా కోలా ప్రస్థానం మళ్లీ మొదలైంది: లోకేశ్

- కర్నూలు జిల్లా ఓర్వకల్లులో రిలయన్స్ అతిపెద్ద ప్లాంట్
- కేవలం ఏడాది వ్యవధిలోనే పూర్తయిన ప్రాజెక్ట్
- కాంపా కోలా జ్యూస్‌ల తయారీ ప్రారంభం
- స్థానిక యువతకు 1200 ప్రత్యక్ష ఉద్యోగాలు
- వలసలు తగ్గిస్తూ సొంత జిల్లాలోనే ఉపాధి

పెన్ పవర్ డెస్క్: ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతిలో మరో కీలక మైలురాయి నమోదైంది. ప్రముఖ దిగ్గజ సంస్థ రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్, కర్నూలు జిల్లా ఓర్వకల్లులో ఏర్పాటు చేసిన ఆసియాలోనే అతిపెద్ద బెవరేజ్ ప్లాంట్‌ను విజయవంతంగా ప్రారంభించింది. శంకుస్థాపన జరిగిన కేవలం 12 నెలల వ్యవధిలోనే ఇంతటి భారీ అత్యాధునిక తయారీ నాకేంద్రాన్ని పూర్తి చేసి కార్యకలాపాలు ప్రారంభించడం విశేషం. ఈ సాయంత్రం ఐదు గంటలకు ఓ భారీ ప్రకటన ఉంటుందన్న మంత్రి నారా లోకేశ్.. చెప్పినట్టుగానే ఈ మేరకు ప్రకటన చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో గత ఏడాది నవంబర్‌లో ఈ ప్రాజెక్టుకు భూమిపూజ జరిగింది. పనులను శరవేగంగా

- మిగతా 2లో



అయ్యప్ప భక్తులకు గుడ్ న్యూస్..

విమానాల్లో ఇరుముడి తీసుకెళ్లేందుకు గ్రీన్ సిగ్నల్

పెన్ పవర్ డెస్క్: అయ్యప్ప స్వాములకు కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. ఇరుముడిని విమానంలో తీసుకెళ్లేందుకు అయ్యప్ప భక్తులకే అనుమతి ఇచ్చింది. ఈ మేరకు కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్

- మిగతా 2లో

హే రామ్.. ఆంధ్రప్రదేశ్ ను కాపాడు

- ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై తీవ్రస్థాయిలో మండిపడ్డ జగన్
- నామినేషన్లు చించేసి గెలిచినవారిని ఓడించారంటూ వైసీపీ అధినేత ఆరోపణలు
- ఎంపీ అవినాశ్ రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డిలపై హత్యాయత్నాలు జరిగాయని ఆవేదన
- పోలీసులు, అధికారులు అధికార పార్టీతో కుమ్మక్కయ్యారని జగన్ ఆగ్రహం
- ఎన్నికల అక్రమాలకు సంబంధించిన వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన జగన్

పెన్ పవర్ డెస్క్: ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియపై వైసీపీ అధినేతజగన్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మున్సిపల్, జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికలతో పాటు ప్రస్తుతం పార్టీ రహితంగా జరుగుతున్న పంచాయతీ ఎన్నికలను కూడా అధికార కూటమి రిగ్గింగ్ చేస్తోందని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో అసలు ప్రజాస్వామ్య సూత్రాలే అమలు కావడం లేదని, ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచేలా ప్రస్తుత పరిస్థితులు ఉన్నాయని ఆయన సోషల్ మీడియా వేదికగా విమర్శించారు. హే రామ్.. ఆంధ్రప్రదేశ్ ను కాపాడు అంటూ ట్వీట్ చేశారు.

ప్రస్తుతం రాష్ట్రంలో 'ఫ్రీ అండ్ ఫెయిర్' ఎన్నికలు నిర్వహించాల్సిన పరిస్థితులు పూర్తిగా కనుమరుగయ్యాయని జగన్ ఆరోపించారు. విపక్ష అభ్యర్థులను నామినేషన్లు వేయనివ్వకుండా అడ్డుకోవడమే కాకుండా, దాఖలు చేసిన నామినేషన్ పత్రాలను అధికారులే నేరుగా చించివేశారని ఆయన ఆరోపించారు. పోలింగ్ కేంద్రాలను ఆక్రమించి ఓట్లను అపహరిస్తున్నారని, చివరకు ఎన్నికల్లో గెలిచిన వారిని కూడా ఓడినట్లుగా ప్రకటిస్తున్నారని పేర్కొన్నారు. రిటర్నింగ్ అధికారులు (ఆర్వోలు), పోలీసులు, అధికార పార్టీ నాయకులు కుమ్మక్కై ఫలితాలను ప్రభావితం చేస్తున్నారని, ఎన్నికల సంఘం కూడా అధికార పార్టీ



చర్యలను అడ్డుకోవడంలో విఫలమైందని జగన్ విమర్శించారు.

గత ఐదేళ్ల తమ పాలనలో రాష్ట్రం ఎంతో సుస్థిరంగా, ప్రశాంతంగా సాగిందని, కానీ ప్రస్తుత ప్రభుత్వ హయాంలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకుంటూ వ్యవస్థలు పూర్తిగా భ్రష్టుపట్టాయని జగన్ పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిలపై జరిగిన హత్యాయత్నాల ఘటనలే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు. తాడిపత్రిలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటిపై స్థానిక టీడీపీ ఎమ్మెల్యే, ఆయన అనుచరులు పెద్ద సంఖ్యలో

- మిగతా 2లో



యువ డాక్టర్లకు నడ్డా కీలక పిలుపు..

ఈ విధానం తప్పనిసరిగా వాడండి!

- ఈ-ప్రిస్క్రిప్షన్ విధానాన్ని పాటించాలని సూచన
- ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌లో భాగస్వాములు కావాలని పిలుపు
- పుదుచ్చేరి జిప్‌మర్ 15వ స్నాతకోత్సవంలో పాల్గొన్న నడ్డా
- 816 మంది విద్యార్థులకు వైద్య డిగ్రీలు ప్రదానం
- వైద్య వృత్తి సమాజం ఇచ్చిన వరమని వ్యాఖ్య
- వైద్య విద్య కోసం గతేడాది రూ.15 వేల కోట్లు కేటాయించిన కేంద్రం

- మిగతా 2లో

కొత్త ఎయిర్‌లైన్స్‌కు భోగాపురం కేంద్రస్థానం కావాలి

- కుప్పం, పలాస ఎయిర్‌పోర్టులకు భూసేకరణ జరుగుతోందన్న రామ్మోహన్ నాయుడు
- భోగాపురంపై కేంద్ర పౌర విమానయాన శాఖ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిందని వెల్లడి
- సీఐఐ సమ్మిట్‌తో ఏపీ బ్రాండ్‌ను ప్రపంచవ్యాప్తం చేశామన్న కేంద్ర మంత్రి

- మిగతా 2లో





ఘనంగా అనిరుధ్ - కావ్య రిసెప్షన్..

హాజరైన సినీ, రాజకీయ ప్రముఖులు

పెన్ పవర్ డెస్క్: ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ , సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) సీఈవో, సన్ నెట్‌వర్క్ అధినేత కళానిధిమారన్ కుమార్తె కావ్య మారన్

వివాహం బంధంతో ఒక్కటైన సంగతి తెలిసిందే. శనివారం వీరి వివాహ రిసెప్షన్ చెన్నైలో ఘనంగా జరిగింది. ఈ వేడుకకు సినీ, రాజకీయ ప్రముఖులు విచ్చేసి నూతన దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. తమిళనాడు సీఎం విజయ్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, తమిళనాడు మాజీ సీఎంలు స్టాలిన్, పళనిస్వామి, అగ్ర నటులు రజనీకాంత్, కమల్‌హాసన్, రాధికా శరత్‌కుమార్, క్రికెటర్ భువనేశ్వర్ కుమార్ తదితరులు హాజరయ్యారు.

బంగారం కొనొద్దన్నా..

ధరలు తగ్గాయంటున్న మోదీ!

- ఏడాది పాటు బంగారం కొనుగోళ్లు ఆపాలని గతంలో ప్రధాని విజ్ఞప్తి
- ప్రజలు తన సూచన పాటించారని మోదీ వ్యాఖ్య

- మిగతా 2లో



జగన్ ప్యాలెస్ లోకి నో ఎంట్రీ..!



షర్మిలకు బెంగుళూరు కోర్టులో బిగ్ షాక్..!

పెన్ పవర్ డెస్క్: ఏపీ పీసీసీ చీఫ్ షర్మిలకు బెంగళూరు కోర్టు బిగ్ షాక్ ఇచ్చింది. గత కొంతకాలంగా వివాదాస్పదంగా మారిన యలహంక ప్యాలెస్ లో షర్మిల జోక్యం చేసుకోవద్దని తేల్చి చెప్పింది దేవనహళ్లి కోర్టు. శనివారం (నవంబర్ 21) ఈమేరకు ఉత్తర్వులు జారీ చేసింది కోర్టు. యలహంక ప్యాలెస్ లో షర్మిల జోక్యం

- మిగతా 2లో

చంద్రబాబు మూల్యం చెల్లించుకోక తప్పదు

- ఏపీ స్థానిక ఎన్నికల్లో దౌర్జన్యాలు విపరీతంగా పెరిగిపోయాయని రామకృష్ణ
- ఎన్నికల్లో పోటీ చేయలేని పరిస్థితులు నెలకొన్నాయని ఆరోపణ
- పాలకపక్ష నేతల కంటే పోలీసుల బెదిరింపులే అధికంగా ఉన్నాయని విమర్శ



పెన్ పవర్ డెస్క్: ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార దుర్వినియోగం, దౌర్జన్యాలు తీవ్రస్థాయికి చేరాయని సీపీఐ నేత రామకృష్ణ ఆరోపించారు. ఏపీలో ప్రస్తుతం స్థానిక ఎన్నికల్లో విపక్షాలు కనీసం పోటీ కూడా చేయలేని పరిస్థితి ఏర్పడిందని మండిపడ్డారు. ప్రజాస్వామ్య బద్ధంగా సాగాల్సిన ఎన్నికల్లో దౌర్జన్యం పెరిగిపోయిందని, ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలోనే

- మిగతా 2లో

పెన్ పవర్

ఆదివారం 22 నవంబర్ 2026



సియాంగ్ మెగా డ్యామ్: అభివృద్ధి పేరుతో ఆదివాసీల అస్తిత్వాన్ని దెబ్బతీయొద్దు!

హామీలతో సరిపెట్టకుండా ప్రజల ఆందోళనలకు పరిష్కారం చూపాలి

దేశాభివృద్ధి, జాతీయ భద్రత, విద్యుత్ ఉత్పత్తి వంటి లక్ష్యాలతో చేపట్టే భారీ ప్రాజెక్టులు ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలి తప్ప వారి అస్తిత్వానికే ముప్పుగా మారకూడదు. అరుణాచల్ ప్రదేశ్‌లో ప్రతిపాదించిన 11,200 మెగావాట్ల సామర్థ్యం కలిగిన సియాంగ్ అప్పర్ మల్టీపర్పస్ ప్రాజెక్టు (SUMP) చుట్టూ నెలకొన్న వివాదం మరోసారి ఈ మౌలిక ప్రశ్నను తెరపైకి తీసుకొచ్చింది. సియాంగ్ లోయలోని ఆదివాసీ సమాజాలు తమ భూములు, సంస్కృతి, సంప్రదాయాలు, జీవనాధారాలు కోల్పోతామన్న ఆందోళనతో ఉద్యమిస్తున్న నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. అరుణాచల్ ప్రదేశ్ పర్యటన సందర్భంగా సియాంగ్ మెగా డ్యామ్‌పై స్థానిక ప్రజల అభ్యంతరాలను సానుకూల చర్చల ద్వారా పరిష్కరిస్తామని, ఆదివాసీల వారసత్వం, ఆచారాలు, సంప్రదాయాలకు ఎలాంటి భంగం కలగనివ్వబోమని అమిత్ షా హామీ ఇచ్చారు. నిర్వాసితులకు దేశంలోనే అత్యుత్తమ పరిహార ప్యాకేజీ అందిస్తామని ప్రకటించారు. అయితే ఇక్కడ గుర్తించాల్సిన ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఆదివాసీ సమాజాలకు భూమి అనేది కేవలం ఆర్థిక వనరు మాత్రమే కాదు. అది వారి చరిత్ర, సంస్కృతి, ఆధ్యాత్మిక విశ్వాసాలు, సామాజిక సంబంధాలతో ముడిపడిన జీవనాధారం. అటువంటి అనుబంధాన్ని కేవలం ఆర్థిక పరిహారంతో భర్తీ చేయడం సాధ్యం కాదు. జాతీయ ప్రయోజనాలు ఎంత ముఖ్యమో స్థానిక ప్రజల హక్కులు కూడా అంతే ముఖ్యం. చైనా, భూటాన్, మయన్మార్ దేశాలతో సరిహద్దులు కలిగిన అరుణాచల్ ప్రదేశ్‌కు వ్యూహాత్మక ప్రాధాన్యం ఉందనడంలో సందేహం లేదు. జాతీయ భద్రత, సరిహద్దు ప్రాంతాల అభివృద్ధి, జలవనరుల వినియోగం వంటి అంశాలను కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యంగా పరిగణించడం సహజమే. అయితే జాతీయ ప్రయోజనాల పేరుతో స్థానిక సమాజాల అభిప్రాయాలను విస్మరించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలంటే నిర్ణయాల రూపకల్పనలో ప్రభావిత ప్రజలకు భాగస్వామ్యం కల్పించాలి. సియాంగ్ ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్న ఆదివాసీ సంఘాల ఆందోళనలను తేలికగా తీసుకోకూడదు. ఆది బానే కెబాంగ్ యునైటెడ్ (ఆదీఖఖ) సంస్థ కేంద్ర హోంమంత్రికి సమర్పించిన వినతిపత్రంలో ప్రాజెక్టును పునఃపరిశీలించాలని కోరింది. గత నాలుగు దశాబ్దాలుగా వివిధ ప్రభుత్వాల పరిశీలనకు వచ్చిన ఈ ప్రాజెక్టును రెండుసార్లు తిరస్కరించారని, తిరిగి 2024లో తెరపైకి తీసుకొచ్చారని ఆ సంస్థ పేర్కొంది. తరతరాలుగా నివసిస్తున్న పూర్వీకుల భూముల నుంచి ప్రజలను తరలించే పరిస్థితి ఏర్పడవచ్చన్న ఆందోళనను వ్యక్తం చేసింది. ఇలాంటి అభ్యంతరాలకు ప్రభుత్వం శాస్త్రీయ ఆధారాలతో, పారదర్శకమైన విధానంలో సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత ఉంది. మరోవైపు భారీ జలవిద్యుత్ ప్రాజెక్టుల వల్ల కలిగే పర్యావరణ ప్రభావాలను కూడా విస్మరించరాదు. నదీ ప్రవాహాల్లో మార్పులు, అటవీ ప్రాంతాలపై ప్రభావం, జీవవైవిధ్యానికి ముప్పు, భూకంప ప్రభావిత ప్రాంతాల్లో భారీ నిర్మాణాల భద్రత వంటి అంశాలపై సమగ్ర అధ్యయనం అత్యవసరం. ముఖ్యంగా హిమాలయ పర్వత ప్రాంతాల్లో చేపట్టే ప్రాజెక్టులకు సంబంధించి స్వతంత్ర నిపుణుల అభిప్రాయాలు, పర్యావరణ ప్రభావ అంచనాలు ప్రజలకు అందుబాటులో ఉంచాలి. ప్రాజెక్టు వల్ల కలిగే ప్రయోజనాలతోపాటు సంభవించే నష్టాలను కూడా నిజాయితీగా వెల్లడించాలి. ప్రజల విశ్వాసాన్ని పొందకుండా ఏ భారీ ప్రాజెక్టు కూడా నిజమైన విజయాన్ని సాధించలేదు. ఆందోళనలను కేవలం శాంతిభద్రతల సమస్యగా చూడటం సరైన విధానం కాదు. ప్రజలు నిరసనలకు దిగడానికి దారితీసిన కారణాలను గుర్తించి పరిష్కరించాలి. ప్రభుత్వం, ఆదివాసీ ప్రతినిధులు, పర్యావరణ నిపుణులు, స్థానిక ప్రజాసంఘాలతో కూడిన అర్థవంతమైన చర్చల ప్రక్రియను ప్రారంభించాలి. భూసేకరణ, పునరావాసం, ఉపాధి, సాంస్కృతిక పరిరక్షణ, పర్యావరణ భద్రత వంటి అంశాలపై స్పష్టమైన హామీలు మాత్రమే కాకుండా వాటి అమలుకు చట్టబద్ధమైన రక్షణలు కల్పించాలి. కేంద్ర హోంమంత్రి ప్రకటించిన అత్యుత్తమ పరిహార ప్యాకేజీ స్వాగతించదగిన హామీ అయినప్పటికీ, పరిహారం ఒక్కటే సమస్యకు సంపూర్ణ పరిష్కారం కాదు. తమ భవిష్యత్తును ప్రభావితం చేసే నిర్ణయాల్లో స్థానిక ప్రజలకు నిర్ణయాత్మక భాగస్వామ్యం ఉండాలి. వారు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలను సమగ్రంగా పరిశీలించకుండా ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లడం అనిశ్చితిని మరింత పెంచే ప్రమాదం ఉంది. అభివృద్ధి అంటే కేవలం భారీ ఆనకట్టలు, వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి, కోట్లాది రూపాయల పెట్టుబడులు మాత్రమే కాదు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటం, వారి హక్కులు పరిరక్షించబడటం, ప్రకృతి సంపద భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉండటం కూడా అభివృద్ధిలో అంతర్భాగాలే. సియాంగ్ లోయ ప్రజలకు అమిత్ షా ఇచ్చిన హామీలు మాటలకే పరిమితం కాకుండా కార్యాచరణలో ప్రతిఫలించాలి. జాతీయ భద్రతకు, విద్యుత్ అవసరాలకు ప్రాధాన్యం ఇస్తూనే ఆదివాసీల ఆత్మగౌరవాన్ని, సంస్కృతిని, జీవనాధారాలను కాపాడే సమతుల్య విధానాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించాలి. ప్రజలను ఒప్పించడమంటే వారి అభ్యంతరాలను వినకుండా నిర్ణయాలను రుద్దడం కాదు; వారి సందేహాలకు సమాధానం ఇచ్చి విశ్వాసాన్ని సంపాదించడం.ప్రకృతిని కాపాడుతూ, ప్రజల హక్కులను గౌరవిస్తూ సాధించే ప్రగతే నిజమైన అభివృద్ధి. సియాంగ్ ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వాలు గుర్తుంచుకోవాల్సిన ప్రాథమిక సూత్రం ఇదే!

2027 గోదావరి పుష్కరాలకు భారీ ప్లాన్!

- మొదటి పేజీ తరువాయి

కాగా, రూ. 25.53 కోట్ల విలువైన 69 పనులు పూర్తయ్యాయి. పనుల పురోగతి, నిధుల వినియోగాన్ని పారదర్శకంగా పర్యవేక్షించేందుకు అన్ని శాఖలు జిల్లాల వారీగా వివరాలను ప్రత్యేక పోర్టల్‌లో నమోదు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

ప్రజా భాగస్వామ్యం -- పకడ్బందీ ఏర్పాట్లు

ఈ పుష్కరాలను కేవలం ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా, ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు, యువత సహకారాన్ని పెద్దఎత్తున తీసుకోవాలని సూచించారు. విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఇప్పటి నుంచే శిక్షణ ఇవ్వాలని, శాఖల మధ్య సమన్వయం కోసం నిరంతరం సమావేశాలు నిర్వహించాలని స్పష్టం చేశారు.

440 ఘాట్లు.. విస్తృత మౌలిక వసతులు

గోదావరి పరివాహక ప్రాంతంలోని 440 ఘాట్ల వద్ద భక్తులకు అవసరమైన నదుపాయాలు కల్పించేలా ప్రణాళికలు సిద్ధమయ్యాయి. తాత్కాలిక మరుగుదొడ్లు, నిరంతర పారిశుధ్య నిర్వహణ, వ్యర్థాల తొలగింపు, తాగునీరు, విద్యుత్ దీపాల ఏర్పాటు కోసం రూ.464 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించారు. వైదిక ఆచారాల నిర్వహణ, భక్తుల బస, వాహనాల పార్కింగ్ కోసం విస్తృత స్థలాలను కేటాయిస్తున్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యామ్నాయ రహదారులను అభివృద్ధి చేయడంతో పాటు, రద్దీని నియంత్రించేందుకు 268.12 కిలోమీటర్ల మేర పటిష్టమైన బారికేడ్లు ఏర్పాటు చేయనున్నారు.

రవాణా, రైల్వే సేవలు

పుష్కరాల సమయంలో భక్తుల ప్రయాణ సౌకర్యార్థం ఆర్టీసీ ఆధ్వర్యంలో 4,000 ప్రత్యేక బస్సులు, పర్యావరణహితంగా ఉండేలా మరో 649 గ్రీన్ బస్సులను నడపనున్నారు. అలాగే రైల్వేశాఖ సహకారంతో 1,560 ప్రత్యేక రైళ్లను నడిపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. రద్దీని దృష్టిలో ఉంచుకుని రాజమండ్రి రైల్వే స్టేషన్‌లో అదనపు ప్లాట్‌ఫారంతో పాటు కొత్త ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నారు.

సాంకేతికత వినియోగం -- వైద్య సేవలు

పుష్కర ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించేందుకు అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. వివిధ రాష్ట్రాలు, దేశాల నుంచి వచ్చే భక్తులకు సులభంగా సమాచారం అందించేందుకు 135 భాషల్లో సేవలందించే ప్రత్యేక ఏఐ చాట్‌బాట్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురానున్నారు. అత్యవసర వైద్య సేవల కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో అదనంగా 100 పడకలను సిద్ధం చేయనున్నారు. ప్రతి ఘాట్ వద్ద వైద్య బృందాలు, అంబులెన్సులు సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

ప్రాజెక్టులు - పర్యావరణ పరిరక్షణ

సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ ఆధునికీకరణ, అభివృద్ధి పనులను 2027 ఏప్రిల్ నాటికి పూర్తి చేయాలని ముఖ్యమంత్రి లక్ష్యంగా నిర్దేశించారు. అలాగే ప్రతిష్ఠాత్మక పోలవరం ప్రాజెక్టును కూడా పుష్కరాల కంటే ముందే పూర్తి చేసి ప్రారంభించేలా పనులు పరుగులు పెట్టించాలని సూచించారు. భక్తులకు జల రవాణా అనుభూతిని అందించేందుకు రాజమహేంద్రవరం--పోలవరం మధ్య 40 కిలోమీటర్ల పరిధిలో ఆరు ఫ్లోటింగ్ పంటూన్లను ఏర్పాటు చేయనున్నారు.

పుష్కరాలను పూర్తి పర్యావరణహితంగా నిర్వహించేందుకు ప్లాస్టిక్ నిషేధం, పకడ్బందీ వ్యర్థాల నిర్వహణ, గోదావరి జలాలు కలుషితం కాకుండా పరిరక్షించడం, సౌర విద్యుత్ వినియోగంపై దృష్టి పెట్టనున్నారు. సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా గోదావరి నదీ హారతి, సామూహిక కూచిపూడి నృత్య ప్రదర్శనలు, భారీ దీపాలంకరణ, గోదావరి ముగ్గుల పోటీలు, సామూహిక యోగా వంటి ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది.

కొత్త ఎయిర్‌లైన్స్‌కు భోగాపురం కేంద్రస్థానం కావాలి

కొత్తగా వచ్చే విమానయాన సంస్థలకు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రధాన స్థావరంగా (బేస్) మారాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. దేశవ్యాప్తంగా విమానయాన రంగాన్ని విస్తరించే క్రమంలో మరిన్ని కొత్త విమానాశ్రయాల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు కేంద్రం వద్ద పరిశీలనలో ఉన్నాయని ఆయన వెల్లడించారు.ఆంధ్రప్రదేశ్‌లో ఎయిర్‌పోర్టుల నెట్‌వర్క్ విస్తరణపై మాట్లాడిన కేంద్రమంత్రి... కుప్పం, పలాస ప్రాంతాల్లో కొత్త ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి సంబంధించి ప్రస్తుతం భూసేకరణ ప్రక్రియ ముమ్మరంగా సాగుతోందని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే ఆయా ప్రాంతాల ముఖచిత్రం పూర్తిగా మారిపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

విశాఖపట్నంలో జరిగిన పెట్టుబడుల సదస్సుల గురించి ప్రస్తావిస్తూ... వైజాగ్‌కు సీఐఐ సమ్మిట్‌లు కొత్తేమీ కాదని రామ్మోహన్ నాయుడు వ్యాఖ్యానించారు. చంద్రబాబు ఇప్పుడే కాకుండా, గతంలోనూ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సీఐఐ సమ్మిట్‌తో పాటు అనేక అంతర్జాతీయ సదస్సులను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించారని గుర్తుచేశారు. ఆ సదస్సుల ద్వారానే ఆంధ్రప్రదేశ్ బ్రాండ్‌ను ప్రపంచవ్యాప్తంగా విస్తరించగలిగామని ఆయన పేర్కొన్నారు.ఇటీవల విశాఖలో నిర్వహించిన సీఐఐ సదస్సు దేశంలోనే ఇంతకుముందెన్నడూ జరగని రీతిలో అత్యంత ఘనంగా జరిగిందని, ఇది రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించేందుకు ఎంతగానో దోహదపడుతుందని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు.

ఆసియాలోనే అతి పెద్ద రిలయన్స్ పానీయాల ఫ్యాక్టరీ..

- మొదటి పేజీ తరువాయి

పూర్తి చేసుకున్న ఈ ప్రపంచ స్థాయి ప్లాంట్‌లో ఇప్పటికే కాంపా కోలా, పండ్ల రసాలు (జ్యూస్‌లు), ప్యాకేజ్డ్ తాగునీటి ఉత్పత్తి మొదలైంది. ప్రభుత్వం అమలు చేస్తున్న 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానానికి ఈ ప్లాంట్ అత్యుత్తమ నిదర్శనంగా నిలిచింది.తరతరాల భారతీయులకు సుపరిచితమైన స్వదేశీ బ్రాండ్ కాంపా కోలా, ఇప్పుడు రాయలసీమ గడ్డ నుంచి సరికొత్త రూపుతో పునర్జన్మ పొందింది. ఓర్వకల్లులో తయారయ్యే ఈ ఉత్పత్తులు దేశవ్యాప్తంగా ఉన్న వినియోగదారులకే కాకుండా, అంతర్జాతీయ మార్కెట్లకు కూడా సరఫరా కానున్నాయి. ప్రపంచస్థాయి దిగ్గజ సంస్థలతో పోటీ పడేందుకు స్వదేశీ బ్రాండ్‌కు ఆంధ్రప్రదేశ్ కేంద్ర బిందువుగా మారడం పట్ల హర్షం వ్యక్తమవుతోంది.ఈ ప్రాజెక్ట్ ద్వారా స్థానిక యువతకు విస్తృత అవకాశాలు దక్కాయి. గతంలో ఉద్యోగాల కోసం సుదూర ప్రాంతాలకు, ఇతర మెట్రో నగరాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితులు ఉండేవి. అయితే ఇప్పుడు నంద్యాలకు చెందిన మహేష్ హరి, కర్నూలుకు చెందిన ఆర్.కె. స్ఫూర్తి వంటి ఎంతో మంది స్థానిక యువతీయువకులు తమ సొంత ప్రాంతంలోనే, అంతర్జాతీయ ప్రమాణాలున్న ప్లాంట్‌లో పనిచేస్తున్నారు. రాయలసీమ యువతకు స్థానికంగానే ఉపాధి కల్పిస్తామన్న హామీ నెరవేరింది.ఈ భారీ ప్లాంట్ ద్వారా స్థానిక ప్రజలకు 1,200 ప్రత్యక్ష ఉద్యోగాలు లభించాయి. దీంతో పాటు రవాణా (లాజిస్టిక్స్), వ్యవసాయ అనుబంధ రంగాలు, ఇతర చిన్నతరహా పరిశ్రమల ద్వారా పరోక్షంగా వేలాది మందికి లబ్ధి చేకూరనుంది. రాష్ట్రంపై నమ్మకంతో పెట్టుబడులు పెట్టినందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు ధన్యవాదాలు తెలుపుతూ, రాష్ట్రంలోని ప్రతి జిల్లాలోనూ ఇలాంటి పారిశ్రామిక విజయాలను విస్తరింపజేయడమే లక్ష్యంగా ప్రణాళికలు ముందుకు సాగుతున్నాయి. ఈ మేరకు నారా లోకేశ్ సోషల్ మీడియాలో వివరాలు పంచుకున్నారు.

అయ్యప్ప భక్తులకు గుడ్ న్యూస్..

- మొదటి పేజీ తరువాయి

నాయుడు ఎక్స్ (ట్విట్టర్) వేదికగా వెల్లడించారు. అయ్యప్ప భక్తులు ఇరుముడిని తమవెంట తీసుకెళ్లడం సంప్రదాయమని పేర్కొన్నారు. ఇరుముడిని విమానం క్యాబిన్?లోకి తీసుకెళ్లేందుకు అనుమతి ఉంటుందని చెప్పారు. స్వాముల భక్తి, విశ్వాసం, నమ్మకం, సంప్రదాయాన్ని గౌరవిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. కాగా, విమానంలో ఇరుముడి తీసుకెళ్లేందుకు స్వాములకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వడం వరుసగా ఇది మూడోసారి. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై విమానం ద్వారా శబరి వెళ్లే అయ్యప్ప మాలధారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయ్యప్ప భక్తులకు శుభవార్త చెప్పింది శబరిమల దేవస్థానం. మండల పూజ కోసం వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అధికారులు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కొండపై యాత్రికుల రాకపోకలను క్రమబద్ధీకరించడానికి, వారికి అవసరమైన సమాచారాన్ని అందించడానికి మరిన్ని సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు అధికారులు.

ముఖ్యంగా అప్పం, అరవణ ప్రసాద విక్రయ కేంద్రాల దగ్గర భక్తుల రద్దీని నియంత్రించడంపై అధికారులు దృష్టి సారించారు. ప్రస్తుతం ఈ ప్రాంతాన్ని వన్-వే జోన్‌గా ప్రకటించినప్పటికీ, భక్తులు రెండు వైపుల నుంచి రాకపోకలు సాగిస్తుండటంతో అక్కడ కొత్తగా సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రసాదం ఇచ్చే కౌంటర్లు, రసీదులు ఇచ్చే కౌంటర్ల మధ్య భేదాన్ని యాత్రికులు సులభంగా గుర్తించేలా ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు అధికారులు. పబ్లిక్ రిలేషన్స్ ఆఫీస్ సమీపంలోని అనౌన్స్‌మెంట్ సెంటర్‌ను గుర్తించేందుకు కొత్త బోర్డును ఏర్పాటు చేయాలని... అలాగే, వలియ నాడ పందల్ దగ్గర ఉన్న డిజిటల్ స్క్రీన్‌లపై భక్తులకు అవగాహన కల్పించేందుకు వివిధ భాషల్లో సందేశాలను ప్రదర్శించాలని నిర్ణయించారు అధికారులు.

దుకాణాలలో వస్తువుల ధరల నియంత్రణకు సంబంధించి అధికారులు కఠిన నిబంధనలు అమలు చేస్తున్నారు. దుకాణదారులు వస్తువుల ధరల పట్టికను నాలుగు భాషల్లో భక్తులకు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని ఆదేశించారు. గతంలో నిర్వహించిన తనిఖీల సమయంలో చాలామంది బోర్డులను లోపల ఉంచినట్లు గుర్తించడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. అలాగే, టెండర్లు దక్కించుకున్న దుకాణదారులు తమ పరిమితికి మించి రోడ్డుపైకి ఆక్రమణలు చేయకుండా ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు చర్యలు తీసుకోనుంది. దీనిపై బోర్డు లీజు అధికారి నిరంతరం తనిఖీలు నిర్వహిస్తారని వెల్లడించారు. ఎయిర్ పోర్టు నుంచి పంబకు ప్రత్యేక బస్సులుశబరిమల అయ్యప్ప స్వామి దర్శనానికి వెళ్లే భక్తులకు కేరళ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. అయ్యప్ప భక్తుల ప్రయాణాన్ని మరింత సులభతరం చేసేందుకు తిరువనంతపురం, కొచ్చి అంతర్జాతీయ విమానాశ్రయాల నుంచి నేరుగా పంబకు ఏసీ బస్సు సర్వీసులను ప్రారంభించింది. కేరళ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి సి.పి. జాన్ ఈ ప్రత్యేక సర్వీసులను ప్రకటించారు. విమానాల్లో వచ్చే అయ్యప్ప భక్తులతో పాటు సాధారణ ప్రయాణికులు కూడా ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు.

జగన్ ప్యాలెస్ లోకి నో ఎంట్రీ..!

- మొదటి పేజీ తరువాయి

చేసుకోకుండా నిరోధించాలని జగన్ దాఖలు చేసిన పిటిషన్ పై విచారణ చేపట్టిన కోర్టు ఈమేరకు తీర్పు వెల్లడించింది.ఆదివారం (నవంబర్ 22) జగన్ ఇంటి ముందు షర్మిల భారీ ధర్నాకు ప్లాన్ చేసిన క్రమంలో కోర్టు తీర్పు బిగ్ షాక్ అనే చెప్పాలి. షర్మిల కానీ, షర్మిల కుటుంబసభ్యులు, అనుచరులు ఎవరూ కూడా జగన్ యలహంక లోని జగన్ ఇంటి పరిసరాలకు వెళ్లోద్దని స్పష్టం చేసింది కోర్టు. జగన్ ఇంటికి సంబంధించిన గోడలు, చెట్లు ఫెన్సింగ్ మొదలుకొని ఏ ఒక్క వస్తువు నష్టం వాటిల్లేలా వ్యవహరించొద్దని స్పష్టం చేసింది కోర్టు. గత కొంతకాలంగా యలహంక ప్యాలెస్ కేంద్రంగా వివాదం నెలకొన్న సంగతి తెలిసిందే. షర్మిల తన కుమార్తె అంజలి వివాహాన్ని యలహంక ప్యాలెస్ లో నిర్వహించాలని భావించిన క్రమంలో భద్రతా కారణాల దృష్ట్యా అభ్యంతరం వ్యక్తం చేశారు జగన్. దీంతో అంజలి వివాహ వేదిక మార్చుకోవాల్సి వచ్చింది. ఈ క్రమంలో తన కూతురు వివాహానికి జగన్ ను ఆహ్వానించేందుకు షర్మిల తన కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం యలహంక ప్యాలెస్ కు వెళ్లి, అక్కడే బస చేయాలని నిర్ణయించుకుంది.ఈ క్రమంలో అప్రమత్తమైన జగన్ టీం న్యాయపరమైన చర్యలు మొదలుపెట్టింది.షర్మిల నేరుగా యలహంక ప్యాలెస్ కు వస్తే భద్రతా సిబ్బందితో అడ్డుకోవడం ద్వారా అనవసర రాజకీయ దుమారం రేగుతుందని జగన్, ఎలాంటి వివాదాలకు తావులేకుండా ఉండేందుకే చట్టబద్ధంగా కోర్టు ద్వారా ఇంజంక్షన్ ఆర్డర్ కోరినట్లు సమాచారం. ఈ క్రమంలో ఆదివారం యలహంక ప్యాలెస్ దగ్గర హై డ్రామా చోటు చేసుకుంటుందా అన్న ఉత్కంఠ నెలకొంది.

హే రామ్.. ఆంధ్రప్రదేశ్ ను కాపాడు

- మొదటి పేజీ తరువాయి

దాడికి దిగారని, పోలీసుల ముందే వాహనాలకు నిప్పంటించి చంపే ప్రయత్నం చేశారని జగన్ ఆరోపించారు. ఇలాంటి దారుణాలకు పాల్పడిన వారికి ప్రభుత్వం కొమ్ముకాస్తూ, బాధితులపైనే అక్రమ కేసులు నమోదు చేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ ఎన్నికల్లో చోటుచేసుకున్న ఘటనలకు సంబంధించిన పలు వీడియోలను వైఎస్ జగన్ తన సోషల్ మీడియా ఖాతా ద్వారా పంచుకున్నారు. రాష్ట్రంలో పరిస్థితి దారుణంగా ఉందని పేర్కొంటూ, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటూ జగన్ తన పోస్ట్‌లో పిలుపునిచ్చారు.

యువ డాక్టర్లకు నడ్డా కీలక పిలుపు..

పుదుచ్చేరి: యువ వైద్యులకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి జేపీ నడ్డా కీలక అభ్యర్థన చేశారు. ఈ-ప్రిస్క్రిప్షన్ విధానాన్ని పాటించి ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పుదుచ్చేరిలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్‌గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ 15వ స్నాతకోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 816 మందికి వైద్య డిగ్రీలు ప్రదానం చేశారు. అనంతరం యువ డాక్టర్లను ఉద్దేశించి నడ్డా మాట్లాడుతూ... 'మీరంతా వైద్యులుగా మారుతున్నారంటే.. అది సమాజం మీకిచ్చిన ఓ వరం. అందువల్ల ప్రజలకు సేవ చేయాల్సిన సామాజిక బాధ్యత మీపై ఉంది' అని అన్నారు."నేను విద్యార్థి నాయకుడిగా ఉన్నప్పుడు.. చదువు మా జన్మ హక్కు అని చెప్పేవాడిని. అవును..విద్య అనేది ప్రతి ఒక్కరి జన్మహక్కు. అయితే, ప్రాథమిక, సెకెండరీ విద్య జన్మహక్కు కావొచ్చేమోగానీ.. వైద్య విద్య మాత్రం సమాజం మనకిచ్చే వరం అన్న సంగతి గుర్తుపెట్టుకోవాలి. సమాజం, ప్రభుత్వం అందిస్తున్న సహకారంతోనే వైద్య విద్య సాధ్యమవుతోంది" అని నడ్డా అన్నారు. వైద్య విద్యలో కొత్తగా 10 వేల గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్ సీట్లను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు గతేడాది కేంద్ర ప్రభుత్వం రూ.15 వేల కోట్లు కేటాయించిందని చెప్పారు. ఒక్కో సీటుపై నాలుగేళ్లలో రూ.1.5 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు గుర్తు చేస్తూ.. అందుబాటులో ఉన్న అవకాశాలు, వనరులను ఉపయోగించుకొని సమాజాభివృద్ధికి కృషి చేయాలని యువ డాక్టర్లను కోరారు.

చంద్రబాబు మూల్యం చెల్లించుకోక తప్పదు

- మొదటి పేజీ తరువాయి

జరుగుతుం డటంతో ఆయన రాజకీయ జీవితానికి మాయని మచ్చగా మిగిలిపోతుందని పేర్కొన్నారు. కర్నూలులో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు."అధికార పార్టీ నేతల కంటే పోలీసుల ఎక్కువ బెదిరింపు రాజకీయాలకు పాల్పడుతున్నారు. ఈ ఎన్నికలు చంద్రబాబుకు మచ్చగా తయారయ్యాయి. దీనికి చంద్రబాబు మూల్యం చెల్లించుకోక తప్పదు. ఏపీలో ఓటు హక్కు కోసం ఎన్నికల నిర్వహణపై ప్రజలు ఉద్యమాలు చేయాలి. డబ్బులు చెల్లిస్తే ఓటు వేసే సంస్కృతిని ఈ ప్రభుత్వం తీసుకొచ్చింది. ఎన్నికల్లో డబ్బు, దౌర్జన్యాలతో ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంగా మార్చారు" అని ఆరోపించారు.ఓటు హక్కు పరిరక్షణ కోసం, నిష్పాక్షిక ఎన్నికల నిర్వహణ కోసం ప్రజలు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికలు ముగిసిన తర్వాత చోటుచేసుకున్న దాడులు, దౌర్జన్యాలపై సీపీఐ ఆధ్వర్యంలో మేధావులతో ప్రత్యేక చర్చా వేదికలు, సభలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తెస్తామని వెల్లడించారు.

బంగారం కొనొద్దన్నా.. ధరలు తగ్గాయంటున్న మోదీ!

బంగారం ధరలకు సంబంధించి ప్రధాని నరేంద్ర మోదీ (ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కొన్ని నెలల క్రితం తాను చేసిన విజ్ఞప్తి మేరకు దేశ ప్రజలు బంగారం కొనుగోళ్లను నిలిపివేశారని, ఇప్పుడు ధరలు తగ్గాయని అన్నారు. తన మాట విన్న ప్రజలు డబ్బును ఆదా చేసుకోగలిగారని చెప్పారు. ఒక్క ఏడాది పాటు అవసరం లేకపోతే బంగారం కొనవద్దని గతంలో చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. ఇది పాటించిన ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని.. ఆ సలహాతో తమ డబ్బు ఆదా అయిందని తనతో చెబుతున్నారని వివరించారు. లఖ్‌నవూలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ప్రధాని మోదీ ఈ విధంగా మాట్లాడారు."అవసరం లేకపోతే ఓ ఏడాది పాటు బంగారం కొనకుండా ఉండాలని కొన్ని నెలల క్రితం దేశ ప్రజలకు సూచించా. రోజుకు ఒకపూట భోజనం మానేయాలని గతంలో లాల్ బహదూర్ శాస్త్రి విజ్ఞప్తిని పాటించిన ఈ దేశ ప్రజల స్వభావం ఈనాటికీ అలాగే ఉండటం సంతోషాన్ని కలిగిస్తోంది. నాలాంటి సాధారణ వ్యక్తి చేసిన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకొని తక్కువ బంగారం కొనుగోలు చేశారు. ఇప్పుడు వాటి ధరలు తగ్గాయి" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

అంతర్జా



రాజానగరంలో ఫ్యాన్ స్పీడ్ కి సైకిల్ రిపేర్, పగిలిన గ్లాసు

సీతానగరం, పెన్ పవర్, నవంబర్ 21: రాజానగరం నియోజవర్గంలో జడ్పిటిసి ఎంపీటీసీ ఎన్నికల్లో కూటమి ఓటమి చెందినా సరిదిద్దే నాయకులు లేక ఆ పార్టీ శ్రేణులు కొట్టుమిట్టాడుతున్నాయి. ఓటమి ప్రభావం ప్రస్తుతం జరుగుతున్న గ్రామపంచాయతీ ఎన్నికలపై తీవ్రంగా పడింది. సీతానగరం మండలంలో 21 గ్రామపంచాయతీల్లో ఇప్పటికీ కూటమికి అభ్యర్థులు దొరకని పరిస్థితి ఏర్పడడంతో ఆ పార్టీ శ్రేణులు పలుచోట్ల తలలు కొట్టుకుంటున్నారు. నియోజవర్గంలో జనసేన ఎమ్మెల్యేగా బత్తుల బలరామకృష్ణ ఉండటం, తెలుగుదేశం రాజానగరం ఇన్చార్జిగా బొడ్డు వెంకటరమణ చౌదరి వ్యవహరించడం గత కొంతకాలంగా కార్యకర్తల్లో గందరగోళానికి దారి తీసే పరిస్థితులు ఏర్పడినా రాష్ట్ర అధిష్టాన వర్గం చూసి చూడనట్టుగా పోవడంతో కూటమికి చావు దెబ్బ తప్పు లేదంటున్నారు. సీతానగరం మండలంలో వంగలపూడి ఎంపీటీసీ సభ్యురాలుగా తెలుగుదేశం పార్టీ నాయకుడు గద్దె వెంకటకృష్ణ చౌదరి సతీమణి సత్య మాధవి పోటీ చేయటం రూ. కోట్లు ఖర్చుపెట్టి విజయం సాధించడం రాష్ట్ర స్థాయిలోనే తెలుగుదేశం పార్టీలో తీవ్ర చర్చనీ యాంశంగా మారింది. ఈ నేపథ్యంలోనే పంచాయతీ ఎన్నికలు రావటం తెలుగుదేశం, వైఎస్ఆర్సిపి మద్దతుతో ప్రధాన పార్టీల్లో సర్పంచిగా పోటీ చేసేందుకు ఖర్చుకు భయపడి అభ్యర్థులు ముందుకు రాకపోవడంపై ఆయా పార్టీ నాయకుల్లో అలజడి లేపుతుంది. వైఎస్ఆర్సిపి అధికారంలో ఉన్నప్పుడే సింగవరం గ్రామపంచాయతీ ఎన్నికల్లో తెలుగుదేశం నాయకుడు సంగన పోశయ్య విజయం సాధించారు. ప్రస్తుతం అక్కడ సర్పంచ్ బరిలోకి దిగేందుకు తెలుగుదేశం జనసేన ముందుకు రాకపోవడంపై ఆ పార్టీ శ్రేణులకు ఆందోళన తప్పడం లేదంటున్నారు. ఇక ఇప్పటికీ కూటమి నాయకుల్లో సమన్వయం లేకపోవడంతో చాలా పంచాయతీల్లో అభ్యర్థులు ఎవరనేది ఇప్పటికీ తేలక అంతా అయోమయంలో ఉన్నారు అంటున్నారు. మరొకవైపు వైఎస్ఆర్సిపి నాయకుడు రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆధ్వర్యంలో అన్నిచోట్ల సర్పంచులకు పోటీ పడేలా అభ్యర్థులను ముందుగానే ప్రకటించడం విశేషం. ఇప్పటికే సీతానగరం మండలంలో వైఎస్ఆర్ సీపీ తరుపున జడ్పిటిసి సభ్యుడుగా కరుటూరి శ్రీహరిబాబు, ఎంపీపీ సభ్యురాలుగా ఆకుల లలిత సత్య దుర్గ కొత్తగా ఎన్నిక కావడం గ్రామపంచాయతీ ఎన్నికలపై వీరు ప్రత్యేక దృష్టి పెట్టారు.

పెన్ పవర్

పోలవరం - ఏలూరు

తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

పోలవరం జిల్లాను ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా

తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళిక

- పర్యాటక మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత -- కలెక్టర్ కె. బినేష్ కుమార్
- మూడు రోజుల పర్యాటక ప్యాకేజీల రూపకల్పనకు చర్యలు.. రూ.20 కోట్ల గ్యాప్ ఫండింగ్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలి



రంపచోడవరం, (పోలవరం జిల్లా బ్యూరో)పెన్ పవర్ నవంబర్ 21:పోలవరం జిల్లాలో ప్రకృతి అందాలు, జలపాతాలు, నదీ పర్యాటకం, అటవీ ప్రాంతాలు, గిరిజన సంస్కృతి, సాహస పర్యాటక అవకాశాలను సమగ్రంగా అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ప్రత్యేక పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. పర్యాటక రంగ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ పోలవరం జిల్లాను ప్రముఖ పర్యాటక కేంద్రంగా నిలబెట్టేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు.శనివారం రంపచోడవరంలోని ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా పర్యాటక అభివృద్ధి కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజమహేంద్రవరం విమానాశ్రయం, భద్రాచలం మార్గాల ద్వారా పర్యాటకులు సులభంగా జిల్లాకు చేరుకునే అవకాశాన్ని వినియోగించుకుని వారాంతపు పర్యాటక ప్యాకేజీలు రూపొందించాలని తెలిపారు. రంప జలపాతాలు, గుడిస, జలధార, జలతరంగిణి వంటి ప్రాంతాలను అనుసంధానిస్తూ మూడు రోజుల పర్యాటక ప్యాకేజీ సిద్ధం చేయాలని సూచించారు.జిల్లాలోకి వచ్చే పర్యాటకులకు సమాచారం, విశ్రాంతి, పార్కింగ్, తాగునీరు, మరుగుదొడ్లు వంటి సదుపాయాలు కల్పించేందుకు జిల్లా ప్రవేశ మార్గంలో కనీసం అర ఎకరం స్థలంలో స్వాగత కేంద్రం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భద్రాచలం వైపు నుంచి జిల్లాలోకి ప్రవేశించే పోల్స్‌పేట వద్ద గిరిజన సంస్కృతి, సంప్రదాయ కళలు ప్రతిబింబించేలా ఆకర్షణీయమైన ప్రవేశ ద్వారం నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేయాలని తెలిపారు. సామాజిక మాధ్యమాలు, డిజిటల్ ప్రచారం ద్వారా జిల్లాలోని పర్యాటక ప్రాంతాలకు దేశవ్యాప్తంగా గుర్తింపు తీసుకురావాలని పేర్కొన్నారు.గుడిస ప్రాంతంలో తాగునీరు, రహదారులు, మరుగుదొడ్ల సదుపాయాలు, పోచవరం, గండిపోచమ్మ ప్రాంతాల్లో పడవల రేవుల నిర్మాణం, కాకవాడ--ఆకుమామిడి తోట--బంద--గుర్తేడు మార్గాల్లో వీక్షణ కేంద్రాల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. రెండు రెవెన్యూ డివిజన్ల పరిధిలో ఒక్కొక్కటి రూ.10 కోట్ల చొప్పున మొత్తం రూ.20 కోట్ల వ్యయంతో లోటు నిధుల ప్రతిపాదనలు రూపొందించి సోమవారం సాయంత్రంలోగా సమర్పించాలని సబ్ కలెక్టర్లను ఆదేశించారు.రంపచోడవరం డివిజన్‌లో గుర్తించిన సుమారు 400 ఎకరాలకు పైగా భూమితో పాటు చింతూరు ప్రాంతంలో గుర్తించిన భూములకు సంబంధించి జెన్‌కో, నీటిపారుదల తదితర శాఖల నుంచి నిరభ్యంతర పత్రాలు త్వరగా పొందాలని తెలిపారు. పర్యాటక అభివృద్ధికి అనువైన భూములతో జిల్లా భూ బ్యాంకును సిద్ధం చేయాలని సూచించారు. మోతుగూడెం, భూపతిపాలెం ప్రాంతాల్లో రిసార్టుల ఏర్పాటుకు అవకాశాలను పరిశీలించి, డిసెంబర్‌లో నిర్వహించనున్న పెట్టుబడిదారుల సదస్సు నేపథ్యంలో టెండర్లు, ఆసక్తి వ్యక్తీకరణ ప్రక్రియలను ప్రారంభించాలని ఆదేశించారు.జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ కలెక్టర్ సూచించిన అంశాలను ప్రాధాన్యత క్రమంలో అమలు చేసేందుకు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటామని తెలిపారు. తుమ్మిలేరు ప్రాంతంలో సూర్యాస్తమయ వీక్షణ కేంద్రం, తాత్కాలిక పడవ విహారం, శిబిరాల ఏర్పాటు, ఆధునిక విడిది సదుపాయాల అభివృద్ధికి ఉన్న అవకాశాలను పరిశీలించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు.సాహస పర్యాటక కార్యకలాపాలకు ఏకగవాక్ష విధానం, పర్యాటక ప్రచారానికి సంస్థ ఎంపిక, గోదావరి హారతి నిర్వహణ, సాంస్కృతిక పార్కుల అభివృద్ధి, పర్యాటక ప్రాంతాల్లో ప్లాస్టిక్ నియంత్రణ, భద్రతా ప్రమాణాల ప్రకారం ఉపగ్రహ ఫోన్లు, ప్రత్యేక పడవలు, నియంత్రణ కేంద్రాలు, విశ్రాంతి గదుల ఏర్పాటు తదితర అంశాలపై సమావేశంలో సమీక్షించారు. పర్యాటక అభివృద్ధి పనుల అమలుకు శాఖల మధ్య నిరంతర సమన్వయం కోసం ప్రత్యేక సమాచార బృందాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.ఈ సమావేశంలో రంపచోడవరం సబ్ కలెక్టర్ డి. పృథ్వీరాజ్ కుమార్, చింతూరు సబ్ కలెక్టర్ చిట్టపులి నరేంద్ర పడాల్, జిల్లా పర్యాటక అధికారి దాసు, అటవీ, రెవెన్యూ, సమాచార, పర్యాటక, నీటిపారుదల తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలవరం జిల్లాలో రెండు విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు

నవంబర్ 26న తొలి విడత, 29న రెండో విడత పోలింగ్

186 కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు.. తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాటు



రంపచోడవరం, (పోలవరం జిల్లా బ్యూరో) పెన్ పవర్ నవంబర్ 21:పోలవరం జిల్లాలో రెండవ సాధారణ స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా గ్రామ పంచాయతీ ఎన్నికలను రెండు విడతల్లో నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. దినేష్ కుమార్ వెల్లడించారు. తొలి విడత ఎన్నికలు నవంబర్ 26న, రెండో విడత ఎన్నికలు నవంబర్ 29న నిర్వహించనున్నట్లు తెలిపారు.శనివారం కలెక్టరేట్ నుంచి ఎన్నికల విధులకు నియమితులైన రిటర్నింగ్ అధికారులు, ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బందితో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. తొలి విడతలో రాజవొమ్మంగి, అడ్డతీగల, గంగవరం ఏజెన్సీ, దేవీపట్నం, రంపచోడవరం మండలాల్లో పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. రెండో విడతలో మారేడుమిల్లి, గుర్తేడు, వై.రామవరం మండలాలతో పాటు చింతూరు డివిజన్ పరిధిలోని చింతూరు, వరరామచంద్రపురం, కూనవరం, ఏటపాక మండలాల్లో ఎన్నికలు జరుగుతాయని పేర్కొన్నారు.తొలి విడత ఎన్నికలకు నియమితులైన ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బందే రెండో విడత ఎన్నికల విధులకు కూడా హాజరు కావాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. నవంబర్ 25న తొలి విడత ఎన్నికల సిబ్బంది తమకు కేటాయించిన పంపిణీ కేంద్రాలకు చేరుకుని ఎన్నికల సామగ్రిని స్వీకరించిన అనంతరం పోలింగ్ కేంద్రాలకు వెళ్లాలని ఆదేశించారు.నవంబర్ 26న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. పోలింగ్ ముగిసిన వెంటనే మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభించి, అదే రోజు సాయంత్రం 5 గంటలలోపు ఫలితాలను ప్రకటించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. జిల్లాలో గుర్తించిన 186 పోలింగ్ కేంద్రాల్లోనే ఓట్ల లెక్కింపు నిర్వహించడంతో పాటు, ఆయా కేంద్రాల్లో తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.ఓట్ల లెక్కింపు కేంద్రాలు, ఎన్నికల సామగ్రి నిల్వ గదుల్లో విద్యుత్, తగినంత వెలుతురు, జనరేటర్ సదుపాయం, తాగునీరు, పారిశుధ్యం, సీసీ కెమెరాల నిఘా, భద్రతా ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని సంబంధిత ఎంపీడీవోలు, తహసీల్దార్లను ఆదేశించారు. ఎన్నికల సామగ్రి, బ్యాలెట్ బాక్సుల భద్రతకు నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు.ఎన్నికల నిర్వహణలో భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పంపిణీ కేంద్రాలు, స్వీకరణ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాలు, ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో సాయుధ పోలీసు సిబ్బందిని మోహరించాలని తెలిపారు.రిటర్నింగ్ అధికారులు, సంబంధిత ఎన్నికల అధికారులు తమకు కేటాయించిన కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైన ఏర్పాట్లను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని స్పష్టం చేశారు.

బొమ్మూరులో ధరణి బియ్యం మొబైల్ వాహనం ప్రారంభం



సబ్ కలెక్టర్ శుభం నోక్వాల్

రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 21:రాష్ట్రంలో బియ్యం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో సామాన్య ప్రజలకు సరసమైన ధరలకు నాణ్యమైన బియ్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ధరణి బియ్యం విక్రయాన్ని విస్తరిస్తున్నట్లు సబ్ కలెక్టర్ శుభం నోక్వాల్ ఐఏఎస్ తెలిపారు. కమిషనర్, పౌర సరఫరాల శాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ వై. మేఘ స్వరూప్ ఆదేశాల మేరకు ధరణి బియ్యం విక్రయాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు చర్యలు చేపట్టినట్లు ఆయన వివరించారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరు గ్రామంలో ధరణి బియ్యం మొబైల్ వాహనాన్ని శనివారం సబ్ కలెక్టర్ శుభం నోక్వాల్ ప్రారంభించారు. మొబైల్ వాహనం ద్వారా గ్రామీణ, మారుమూల ప్రాంతాల ప్రజలకు సైతం వారి నివాస ప్రాంతాలకు సమీపంలోనే సరసమైన ధరలకు నాణ్యమైన బియ్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. జిల్లాలోని 16 ప్రత్యేక విక్రయ కేంద్రాల ద్వారా ధరణి బియ్యం విక్రయాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ధరణి బియ్యం విక్రయ కేంద్రాల్లో కేఎన్ఎం/ఆర్ఎన్ఆర్ రకం బియ్యం కిలో రూ.50 చొప్పున, బీపీటీ రకం బియ్యం కిలో రూ.49 చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 4,920.60 క్వింటాళ్ల బియ్యాన్ని 18,301 మంది వినియోగదారులకు విక్రయించినట్లు వెల్లడించారు. వినియోగదారులకు సౌకర్యవంతంగా, అందుబాటు ధరల్లో బియ్యం అందించేందుకు మొబైల్ వాహనాల ద్వారా విక్రయాలను విస్తరించాలని నిర్ణయించినట్లు చెప్పారు. బొమ్మూరులో తొలి మొబైల్ వాహనాన్ని ప్రారంభించామని, మరో నాలుగు ధరణి బియ్యం మొబైల్ వాహనాలను కూడా ప్రారంభించనున్నట్లు సబ్ కలెక్టర్ తెలిపారు.ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని సరసమైన ధరలకు అందించడంతో పాటు, విక్రయ కేంద్రాలు మొబైల్ వాహనాల ద్వారా ఈ పథకాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పౌర సరఫరాల శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ బి. గణేష్, సహాయ పౌర సరఫరాల అధికారి బి. నాగాంజనేయులు, రూరల్ తహశీల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ తహశీల్దార్ (పౌర సరఫరాలు), అధికారులు పాల్గొన్నారు.

గార్లపాడు శివారులో పోలీసుల విస్తృత వాహన తనిఖీలు

మన్యం నుంచి మైదాన ప్రాంతాలకు వెళ్లే వాహనాల ధ్రువపత్రాల పరిశీలన

గంగవరం,పెన్ పవర్, నవంబర్ 21: మండల పరిధిలోని గార్లపాడు శివారులో శనివారం రాత్రి పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. రంపచోడవరం డీఎస్పీ పి. అశ్రఫ్ అలీ, గంగవరం ఎస్సై ఎస్. వెంకయ్య ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. మన్యం ప్రాంతం నుంచి మైదాన ప్రాంతాలకు రాకపోకలు సాగించే వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా వాహనాల రిజిస్ట్రేషన్ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు, ఇతర అవసరమైన ధ్రువపత్రాలను పరిశీలించారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనదారులకు నిబంధనల మేరకు జరిమానాలు విధించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ప్రయాణ సమయంలో వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలను తమ వెంట ఉంచుకోవాలని పోలీసులు సూచించారు.ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా వాహన తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఈ సందర్భంగా పోలీసులు తెలిపారు. ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుళ్లు రాంబాబు, ఇజ్రాయెల్ రాజుతో పాటు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మూడు గిరిజన సూపర్ బజార్లలో ధరణి సన్న బియ్యం విక్రయాలు

ఆధార్ లేదా రేషన్ కార్డు చూపించి 26 కేజీల బియ్యం బ్యాగు కొనుగోలుకు అవకాశం


కిలో రూ.50కు సన్న బియ్యం.. త్వరలో కిలో రూ.49కు బీపీటీ రకం బియ్యం

రంపచోడవరం, (పోలవరం జిల్లా బ్యూరో) పెన్ పవర్ నవంబర్ 21:పోలవరం జిల్లాలోని గిరిజన ప్రాంత ప్రజలకు నాణ్యమైన సన్న బియ్యాన్ని అందుబాటు ధరలకు అందించేందుకు మూడు ప్రాంతాల్లోని గిరిజన సూపర్ బజార్ల ద్వారా ధరణి బియ్యం విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ప్రకటనలో విక్రయాలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.ప్రస్తుతం కేఎన్ఎం, ఆర్ఎన్ఆర్ రకం సన్న బియ్యాన్ని కిలో రూ.50 చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపారు. 26 కేజీల బియ్యం బ్యాగు ధర రూ.1,300గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఒక కుటుంబానికి నెలకు ఒకసారి ఆధార్ కార్డు లేదా రేషన్ కార్డు చూపించి 26 కేజీల బియ్యం బ్యాగును కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించినట్లు వివరించారు. త్వరలో బీపీటీ రకం సన్న బియ్యాన్ని కిలో రూ.49 చొప్పున అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు.జిల్లాలోని రంపచోడవరం, అడ్డతీగల, రాజమ్మంగి ప్రాంతాల్లో ఈ విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జాయింట్ కలెక్టర్ వెల్లడించారు. రంపచోడవరం పట్టణంలోని ప్రధాన రహదారిపై అంబేద్కర్ సెంటర్ వద్ద ఉన్న గిరిజన సూపర్ బజార్లో, అడ్డతీగల గ్రామంలో సచివాలయం సమీపంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద, రాజమ్మంగి గ్రామంలో నర్సీపట్నం రోడ్డులో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సమీపంలోని గిరిజన సూపర్ బజార్లో ప్రస్తుతం ధరణి బియ్యం అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

గిరిజన ప్రాంత ప్రజలు తమకు సమీపంలోని విక్రయ కేంద్రాలను సందర్శించి ఆధార్ లేదా రేషన్ కార్డు చూపించి బియ్యం కొనుగోలు చేయాలని సూచించారు. మరిన్ని వివరాలు, సందేహాల నివృత్తి కోసం పోలవరం జిల్లా నియంత్రణ కేంద్రం ఫోన్ నంబర్ 9494088922ను సంప్రదించాలని కోరారు. రాజమ్మంగి గిరిజన సూపర్ బజార్‌కు సంబంధించిన వివరాల కోసం ఎల్. ప్రమీలాదేవిని 9493068047 నంబరులో సంప్రదించవచ్చని తెలిపారు.గిరిజన ప్రాంత ప్రజలకు నాణ్యమైన సన్న బియ్యంతో పాటు నిత్యావసర సరుకులను అందుబాటు ధరల్లో అందించేందుకు గిరిజన సూపర్ బజార్ల ద్వారా అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు.



సేవంటే ఊరికే డబ్బులు జల్లడం కాదు.....



- **సేవకే మారుపేరు గాజంగి వల్లి దేవి సత్తిబాబు.....**
- **5 లక్షల రూ.ఆనందయ్య ఆయుర్వేద ముందు.**
- **రోజుకి 500 మంది 6 నెలలు నిత్య అన్నదానం.**

గోకవరం పెన్ పవర్ నవంబర్ 20:-- ప్రజలకు సేవ చేయాలని వచ్చాను అంటున్నా నీవు ప్రజలకు సేవ చేయాలి అంటే డబ్బులు చల్లడం కాదు వాళ్లకు కష్టసుఖాల్లో ఉండాలి సహనం కోల్పోయి నేను ఊళ్లోంచి వెళ్ళిపోతాను అంటాం మరి ఇంకొకసారి నేను ఇక్కడే ఉన్నానంటూ మరోసారి ఇంకోటి అంటూ మరోసారి ఇంకోటి అనటం కాదు ప్రజలకు సేవ చేయాలే అని అనుకున్నప్పుడు వాళ్ల కోసం తెలుసుకుని వాళ్ళకి ఏది అవసరమో అది చేయాలి కానీ డబ్బులు జల్లుకుంటా వెళ్లిపోయి నేను సేవ చేస్తున్నానంటూ నాకు ఓట్లే ఏందంటే గోకవరం ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని ఎవరిని సర్పంచ్ గా గెలిపించాలో ప్రజలకు ముందుగానే తెలుసని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గోకవరం గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి గాజింగి వల్లీదేవి సత్తిబాబు అన్నారు.అస్సలు నీకు డబ్బులు ఎక్కడ నుండి వస్తున్నాయి. నాడు దళితులను క్రైస్తవులను ముస్లిములను కొట్టి తరిమేయాలని పిలుపునిచ్చావా నేడు చర్చిలకు వెళ్లి ప్రార్థన చేస్తానంటూ అంటున్నావా నీలాంటి ఊసరవెల్లి రాజకీయాలు మా గోకవరంలో వద్దు నీకు తగిన గుణపాఠం దళితులు చెబుతారు అంటూ ఘాటుగానే విమర్శించారు గాజింగి సత్తిబాబు, మైనారిటీలు మీకు కావాలన్నావు దళితులు మైనార్టీలు బడుగు బలహీన వర్గాలు పేదలు కార్మికులు కావాలన్నావు వాళ్లలో ఎవరికైనా నువ్వు న్యాయం చేస్తున్నాం ఈ కులం పేరుతో నువ్వు ఏ మతం పేరుతో ప్రజల రెచ్చగొట్టవు అవన్నీ మా దగ్గర లేవు అనుకుంటున్నావా అవన్నీ ప్రజల ముందు పెడతాం. నీ కపటం నాటకం నీ కపటం మూసుకుని వస్తున్న డబ్బులు ఎక్కడవో అవన్నీ కూడా బయటికి తీస్తాం కాబట్టి తనదైన స్టైల్ లో ఘాటుగా స్పందించారు సత్తిబాబు. కరోనా కష్టకాలంలో నువ్వేమైపోయావ్ ఇదే గాజుల సత్తిబాబు అనే వ్యక్తి 5 లక్షల రూపాయలు పెట్టి నెల్లూరు నుంచి ఆనందయ్య ఆయుర్వేద మందు తెచ్చి మండలం అంతా పంపిణీ చేశానే ఒక్క రూపాయి నేను ఆశించానా, ప్రతిరోజు 500 మందికి వంట చేయించే ఇంటింటికి భోజనాలు పంపించి కరోనా కష్టకాలంలో ఆదుకున్నాను సేవ అంటే అది నీ చుట్టూ ఉన్న జనానికి డబ్బులు పంచి డబ్బుతో ఏదన్నా చేయాలనుకోవడం సేవ కాదు డబ్బులు పంచడం నీ మూర్ఖత్వం ఆపదలో ఉన్న వాళ్ళని ఆదుకునే వాళ్ళకి ఏం కావాలో గుర్తించడమే సేవ అలాంటి సేవా కార్యక్రమాలు చెప్పుకుంటూ పోతే మా గార్జింగా వారి షరతులు ఎన్నో ఉన్నాయి. నువ్వేం చేసావ్ సేవ ఈరోజు రాజకీయాలంటూ సేవల కోసం మాట్లాడుతున్నావా కులాల మధ్య మతాల మధ్య చిచ్చుపెట్టే నువ్వు మా ప్రశాంతమైన గోకవరంలో ఇలాంటి రాజకీయాలు తెరాలేపుతావా అంటూ ఆ నాయకుడు పై నిప్పులు చేరిగారు.

ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ గోకవరం సిసిఎస్ ఎన్నికల సన్నాహక సమావేశం.

గోకవరం పెన్ పవర్ నవంబర్ 21:- ఏపీఎస్ఆర్టీసీ, గోకవరం డిపో,ఎంప్లాయీస్ యూనియన్ (ఇ.యు.) ఆధ్వర్యంలో గోకవరం డిపో అధ్యక్షుడు. అక్కిరెడ్డి కృష్ణ అధ్యక్షతన శనివారం సిసిఎస్ ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది.ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు, జోనల్ అధ్యక్షకార్యదర్శులు జి. చిరంజీవి, వై.ఎస్. రావు, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల శ్రీనివాస్, విజయ్ ప్రకాష్ బాబు, డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఎ. కృష్ణ, సి.హెచ్. వెంకటేశ్వరరావు, గోకవరం డిపో ఉద్యోగులు హాజరయ్యారు.ఈ సందర్భంగా డిసెంబర్ 22న జరిగే సిసిఎస్ ఎన్నికల్లో పోటీ కొరకు ఇ.యు.తరపున అభ్యర్థి,కండక్టర్ డి. అప్పాజీ ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అనంతరం జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ,సిసిఎస్ ఎన్నికల్లో ఇ.యు. పాలక మండలి వచ్చిన వెంటనే ఒక్కరోజులోనే లోన్ వచ్చే సౌకర్యం కల్పిస్తామని,సిసిఎస్ లోన్లపై వడ్డీ తగ్గించేందుకు కృషి చేస్తాం.సిసిఎస్ ఆఫీసును ఆర్టీసీ హౌస్ నుండి తరలించకుండా చూస్తాం.సిసిఎస్ సభ్యుల సౌకర్యార్థం రాష్ట్రవ్యాప్తంగా ఐదు సర్వీస్ సెంటర్లను పెట్టి మెరుగైన సేవలు అందిస్తాం అని పేర్కొన్నారు.ఈ సిసిఎస్ ఎన్నికల్లో ఇ.యు. బలపరచిన అభ్యర్థులను మెజారిటీగా గెలిపిస్తే, పాలకమండలి ఏర్పాటు చేసిన వెంటనే సిసిఎస్ సభ్యుడు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే ఒక్కరోజులోనే లోన్ ఇప్పిస్తామని, అంతేకాకుండా ప్రస్తుతం ఉన్న సిసిఎస్ లోన్లపై వడ్డీని తగ్గిస్తామని, ఆర్టీసీ హౌస్ నుండి సిసిఎస్ ఆఫీసును తరలించకుండా పర్మినెంట్‌గా ఆర్టీసీ హౌస్‌లోనే ఉంచుతామని హామీ ఇచ్చారు.అలాగే సిసిఎస్ సభ్యులకు మెరుగైన సేవలు అందించేందుకు రాష్ట్రంలో ఐదు చోట్ల సర్వీస్ సెంటర్లు పెడతామని, అందులో భాగంగా రాజమండ్రిలో కూడా ఒక సర్వీస్ సెంటర్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.ఆర్టీసీలో విద్యుత్ బస్సులను ప్రైవేట్ ఆపరేటర్ల ద్వారా ప్రవేశపెట్టి ఆర్టీసీని ప్రైవేటుపరం చేయాలన్న ప్రయత్నాలను ఆర్టీసీ జేఏసీ ద్వారా ఉద్యమాలతో అడ్డుకుంటామని దామోదరరావు తెలిపారు.ఈ కార్యక్రమంలో విజయవాడ జోన్ ఇ.యు.జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు జి.చిరంజీవి, వై.ఎస్.రావు, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు ఆకుల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి సి.హెచ్. విజయ్ ప్రకాష్ బాబు, జిల్లా కమిటీ సభ్యులు.ప్రగడ ప్రసాద్, ఎస్.ఎస్. నారాయణ, సీనియర్ నాయకులు.లక్ష్మణ్ రావు, వీరబాబు, గ్యారేజ్ అధ్యక్షులు. కె. శ్రీనివాస్, కార్యదర్శి.జె. కృష్ణారెడ్డి తదితరులు, డిపోలో ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



నాయకుల నియంత్రత్వ ధోరణి అడ్డు కోవాలనే పోటీ



మీడియా సమావేశంలో మేయర్ స్వతంత్ర అభ్యర్థి అజ్జరపు శ్రీనివాస్

రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 21:రాజకీయ పార్టీల్లో ఏళ్ల తరబడి జెండాలు మోసి, నిరంతరం ప్రజల్లో ఉన్న నిజమైన నాయకులను, కార్యకర్తలను పార్టీలు విస్మరిస్తున్నాయనినగర పాలక సంస్థ మేయర్ పదవికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న అజ్జరపు శ్రీనివాస రావు ఆవేదన వ్యక్తం చేశారు. నేటి రాజకీయ వ్యవస్థలో డబ్బే ప్రధాన అంశంగా మారిపోయిందన్నారు. స్థానిక ఎన్నికల కార్యాలయం వద్ద శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నగర ప్రజలకు నిస్వార్థంగా సేవ చేయాలనే లక్ష్యంతో స్వతంత్ర అభ్యర్థి అయిన తనను ప్రజలు ఆశీర్వ దించాలని కోరారు. తన ఎన్నికల గుర్తు 'ఉంగరం' గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. డబ్బు సంచులను ప్రామాణికంగా తీసుకుని టికెట్లు కేటాయిస్తూ పబ్బం గడుపుకుంటున్న నాయకుల నియంత్రత్వ ధోరణి కి అడ్డకట్ట వేయాలనే ఉద్దేశంతోనే తాను ఎన్నికల పోటీ చేస్తున్నానని స్పష్టం చేశారు. వివిధ వార్డుల్లో స్వతంత్ర అభ్యర్థులను కూడగట్టుకుని ప్రజల్లోకి వెళు న్నామన్నారు. గతంలో రాజకీయ పార్టీల్లో సమిష్టి నిర్ణయాలు ఉండేవని, నేడు అన్ని పార్టీల్లోనూ కొందరి నియంత్రత్వ ధోరణి నడుస్తుందని విమర్శిం చారు. పార్టీ, ప్రజల కోసం చేసిన సేవలను గుర్తించ కుండా, సూట్‌కేసు లు తెచ్చిన వారికే టికెట్లు కట్టబెడుతున్నారని అజ్జరపు వాపోయారు. ప్రజాస్వామ్యంలో ఈ ధోరణి ప్రమాదకరమని, దీనిని సహించలేకే స్వతంత్ర అభ్యర్థిగా మేయర్ గా పోటీ చేస్తున్నానన్నారు. మేయర్‌గా గెలిపిస్తే, స్వతంత్రంగా మేధావులు, నిపుణుల సూచనల ప్రకారం నగర సమగ్రాభివృద్ధికి పాటుపడతానని హామీ ఇచ్చారు. స్వతంత్ర అభ్యర్థులందరినీ కలుపుకుని, ఉమ్మడి కార్యాచరణతో ప్రచారాన్ని ముమ్మరంగా సాగిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఈ విలేకరుల సమావేశంలో స్వతంత్ర అభ్యర్థులు అజ్జరపు రమేష్ సతీమణి అజ్జరపు శ్యామలాదేవి (70), కొల్లి వినయ్ కుమార్ (71), కొల్లి గంగా, (40), నాగరాజులతో (56)పాటు ఎం.ఆర్.పి.ఎస్ నాయకులు, సామాజిక వర్గాల ప్రతినిధులు, స్థానిక పెద్దలు కార్యకర్తలు సంఖ్యలో పాల్గొన్నారు.

ఏకగ్రీవానికి బ్రేక్... కుక్కునూరులో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దార సంజీవరావు

అంబేద్కర్ రాజ్యాంగం అందరిది, ఓటు హక్కును వదులుకోవద్దు

ఏలూరు జిల్లా, కుక్కునూరు పెన్ పవర్ :కుక్కునూరులో వైసీపీ, టీడీపీ మధ్య ఏకగ్రీవానికి యత్నాలు జరుగుతున్న వేళ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలతో స్వతంత్ర అభ్యర్థిగా దార సంజీవరావు నామినేషన్ వేశారు.




ఆయన ఏ పార్టీకి వ్యతిరేకం కాదని, తన పోటీ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమేనని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా సంజీవరావు మాట్లాడుతూ, డాక్టర్ అంబేద్కర్ గారు మనకు ఇచ్చిన గొప్ప వరం రాజ్యాంగం. ఆయన ఒక కులానికి, ఒక మతానికి, ఒక వర్గానికి రాజ్యాంగం రాయలేదు. దేశంలోని ప్రతి పౌరుడికి సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం దక్కాలని రాశారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఎటువంటి తేడా లేకుండా ఓటు హక్కు కల్పించారు. అందుకే ఆ మహనీయుడి ఆశయాలను గౌరవిస్తూ, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని నేను కోరుకుంటూన్నాను,ఏకగ్రీవం పేరుతో ప్రజల చేతిలో ఉన్న ఓటు అనే ఆయుధాన్ని వదులుకోవడం అంబేద్కర్ ఆశయాలకు వ్యతిరేకం" అని అన్నారు.

ఆయన నామినేషన్ వేయడంతో కుక్కునూరులో ఎన్నిక ఖాయమైంది. అంబేద్కర్ భావజాలంతో ఆయన ముందుకు వెళ్తానని అన్నారు.

మత్స్య సంపద పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యత

జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ ఎన్. నిర్మల కుమారి



రాజమహేంద్రవరం, పెన్ పవర్ , నవంబర్ 21:ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం తూర్పుగోదావరి జిల్లా కడియంలోని జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో ప్రపంచ మత్స్యకార దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ ఎన్. నిర్మల కుమారి మాట్లాడుతూ మత్స్యకారుల సేవలను గుర్తించడం, మత్స్య సంపదను సంరక్షించడం, మత్స్యకారుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, వారికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో శిక్షణ అందించడం ప్రపంచ మత్స్యకార దినోత్సవ ఉద్దేశమన్నారు. 1997లో 18 దేశాలకు చెందిన మత్స్యకారులు, ప్రతినిధులు పాల్గొన్న ప్రపంచ మత్స్యకారుల సదస్సు అనంతరం ఈ దినోత్సవ నిర్వహణకు ప్రాధాన్యత ఏర్పడిందని, పెరుగుతున్న జనాభాకు అవసరమైన ఆహార భద్రత కల్పించడంలో మత్స్య సంపద కీలక పాత్ర పోషిస్తోందని, చేపలు, రొయ్యలు జల ఉత్పత్తులు ప్రజలకు ప్రోటీన్లు, పోషక విలువలు సమృద్ధి ఆహార వనరులని తెలిపారు. మత్స్య సంపద రాష్ట్ర, దేశ ఆర్థికాభివృద్ధికి కూడా దోహదపడుతోందన్నారు. సముద్రాలు, నదులు, జల వనరుల్లో చేపలు, రొయ్యలను సేకరిస్తూ మత్స్యకారుల కృషి, సేవలు అభినందనీయమన్నారు. మత్స్య సంపద అభివృద్ధి, మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో భాగంగా మత్స్యకార సహకార సంఘాల నిర్వహణ, అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న ఉత్తమ మత్స్యకార సహకార సంఘాల మహిళా మత్స్యకార సహకార సంఘాల అధ్యక్షులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సహకార సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, మత్స్యకారులు, మత్స్య రైతులు, ఆక్వా రైతులు తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల అనంతరం మిగిలిన అభ్యర్థులు

వైరామవరం, గుర్తేడు, పెన్ పవర్,నవంబర్ 21: పంచాయతీ ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ల పరిశీలన అనంతరం శనివారం అధికారులు జాబితాను ప్రకటించారు. వై రామవరం మండలంలో 12 పంచాయతీలలో 72 మంది సర్పంచ్ అభ్యర్థులను, 213 మంది అభ్యర్థులు వార్డు మెంబర్ల గాను పోటీలో ఉన్నారని తెలిపారు. అదేవిధంగా గుర్తేడు మండలములో ఐదు పంచాయితీలలో 13 మంది సర్పంచ్ అభ్యర్థులుగాను, 127 మంది వార్డు సభ్యులుగాను పరిశీలన అనంతరం ఉన్నారని తెలిపారు.

ప్రత్యేక లోక్ అదాలత్‌లో 18 ఎన్.ఐ. యాక్ట్ కేసులు రాజీ

- ప్రిన్సిపల్ జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా



రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్ 21: రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం జిల్లా వ్యాప్తంగా ఎన్.ఐ. యాక్ట్ కేసుల పరిష్కారం కోసం ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా, సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి యార్లగడ్డ శ్రీలక్ష్మి తెలిపారు. శనివారం నిర్వహించిన ఈ ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహణలో భాగంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా మొత్తం 30 బెంచీలు ఏర్పాటు చేసి, పరిష్కారం నిమిత్తం 753 కేసులను స్వీకరించగా, వాటిలో 18 కేసులు ఇరుపక్షాల పరస్పర అంగీకారంతో రాజీ ద్వారా పరిష్కారమయ్యాయని వెల్లడించారు. ఈ కేసులకు సంబంధించి మొత్తం రూ.40,33,948ల మేర రాజీ సొమ్ము నిర్ణయించినట్లు తెలిపారు. న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను ఇరుపక్షాల సమ్మతితో త్వరితగతిన పరిష్కరించు కునేందుకు లోక్ అదాలత్‌లు దోహద పడతాయన్నారు.

ఎన్నికల సమయంలో అల్లర్లు సృష్టిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు.

- ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలి.
- జగ్గంపేట సిఐ, బి తిరుపతిరావు, కిర్లంపూడి ఎస్సై, జి సతీష్.
- వేలంక, బూరుగుపూడి గ్రామాల్లో ముందస్తు చర్యల్లో భాగంగా 100 మందితో పోలీసు కవాతు



కిర్లంపూడి,పెన్ పవర్ నవంబర్,21: ఎన్నికల సమయంలో ఎవరైనా అల్లర్లు,గొడవలు సృష్టిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జగ్గంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్,బి తిరుపతిరావు, కిర్లంపూడి ఎస్సై జి సతీష్ హెచ్చరించారు. ముందస్తు చర్యల్లో భాగంగా కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం వేలంక, బూరుగుపూడి గ్రామాల్లో గ్రామపంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని 100 మందితో పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ, బి తిరుపతిరావు మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసు శాఖ ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం నిఘా ఉంచుతున్నామన్నారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో అల్లర్లు, గొడవలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల ప్రశాంత నిర్వహణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

కూటమి తరపున సర్పంచ్ అభ్యర్థి గా బరిలోకి దిగిన మేకల వీరసూర్యకళ నామినేషన్ దాఖలు....



శంఖవరం పెన్ పవర్ నవంబర్ 21:- కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజక వర్గం లోని శంఖవరం గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల పోరు మరింత ఆసక్తికరంగా మారుతోంది. కూటమి తరపున సర్పంచ్ అభ్యర్థిగా బరిలోకి దిగిన మేకల వీరసూర్యకళ శనివారం తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. మధ్యాహ్నం 12:38 గంటలకు శంఖవరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎన్నికల అధికారులకు నామపత్రాలను అందజేశారు.నామినేషన్ దాఖలుకు ముందు మేకల వీరసూర్యకళ, కృష్ణ దంపతుల స్వగృహంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కూటమి నాయకుల మద్దతుతో శంఖవరం గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలుస్తున్నట్లు వెల్లడించారు. కాకినాడ పార్లమెంట్ సభ్యుడు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, శంఖవరం మండల జనసేన అధ్యక్షుడు మేడిశెట్టి సూర్యకిరణ్ (బాబీ), జనసేన పార్టీ నాయకుల ప్రోత్సాహం, మద్దతుతో తాను పోటీ చేస్తున్నట్లు తెలిపారు. గతంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం పలు ఉద్యమాలు, కార్యక్రమాల్లో పాల్గొన్న అనుభవం ఉందని పేర్కొన్నారు. గ్రామ ప్రజల నుంచి తనకు లభిస్తున్న ఆదరణ, మద్దతు మరింత ఉత్సాహాన్ని ఇస్తున్నాయని ఆమె అన్నారు. గ్రామ ప్రజల ఆశీస్సులతో ఎన్నికల్లో విజయం సాధించి ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. కూటమి తరపున పోటీ చేస్తున్న ఆమెకు గ్రామంలో ప్రజల నుంచి లభిస్తున్న స్పందన ఎన్నికల ప్రచారానికి బలంగా మారుతుందని పార్టీ శ్రేణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. నామినేషన్ దాఖలుతో శంఖవరం గ్రామంలో ఎన్నికల రాజకీయాలు మరింత వేడెక్కాయి. ఆంధ్రప్రదేశ్‌లో మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ ప్రకారం నవంబర్ 23 వరకు నామినేషన్ల స్వీకరణ, నవంబర్ 24న పరిశీలన, నవంబర్ 27న ఉపసంహరణ ప్రక్రియ జరగనుంది.

ఈ నామినేషన్ ప్రక్రియ కార్యక్రమంలో భారీ సంఖ్యలో కూటమి నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నిరుపేద రోగులకు ఏబీ ఫౌండేషన్ సేవ -పండ్లు,బ్రెడ్లు పంపిణీ



కూనవరం,పెన్ పవర్,నవంబ ర్21. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఏబీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.ఫౌండే షన్ చైర్మన్ కుంజ అనిల్ మాట్లాడుతూ నిరుపేదలకు అండగా నిలవడమే తమ లక్ష్యమని,ప్రతి శనివారం సేవా కార్యక్రమాలు చేస్తున్నా మని తెలిపారు.సమాజంలో వెనుకబడిన వారికి చేయూత ఇవ్వాలని,దాతలు ఫౌండేషన్ కు సహకరించాలని పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కె.కిరణ్ బాబు, టి వినోద్,జల్లారపు రాము, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నా రు.

వికసిత ఆంధ్రప్రదేశ్ లో నగరానికి అభివృద్ధికి ప్రాధాన్యత



కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఎంపీ పురంధేశ్వరి విజ్ఞప్తి

రాజమహేంద్రవరం, పెన్ పవర్, నవంబర్21:బంగారు నగర నిర్మాణమే ఎన్డీఏ కూటమి ప్రభుత్వ లక్ష్యమని,వికసిత ఆంధ్రప్రదేశ్ లో భాగంగా వికసిత రాజమండ్రి కు బాటలు వేయాలని ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో శనివారం వెంకటేశ్వరనగర్‌లోని తన కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. 2024 ఎన్నికల్లో కూటమిపై ప్రజలు విజయం అందించారన్నారు. కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. నగర పాలక సంస్థ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి మేయర్ అభ్యర్థితో పాటు కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపిస్తే నగర అభివృద్ధికి మరిన్ని అవకాశాలు కలుగుతాయన్నారు. రాబోయే గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. రైల్వే స్టేషన్ అభివృద్ధికి, రైల్వే కనెక్టివిటీ పెంపు, కొత్త రైళ్ల ఏర్పాటు చర్యలు తీసు కుంటున్నామన్నారు. రహదారులు, విమానాశ్రయ కనెక్టివిటీని మెరుగుపరు స్తున్నామన్నారు. ప్రధాని మహిళల అభ్యున్నతికి , మహిళా రిజర్వేషన్లకు ప్రాధాన్యత కల్పిస్తోందని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించలేని స్థితిలో ఎన్నికలు జరుపుతున్నామన్నారు. నామినేషన్లలో ప్రతిపక్షాల ఆరోపణలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. మేయర్ అభ్యర్థిగా బీజేపీ అభ్యర్థి రేలంగి శ్రీదేవికి ప్రజలు మద్దతు ఇవ్వాలని పురంధేశ్వరి విజ్ఞప్తి చేశారు. మహిళా సమస్యలపై క్షేత్రస్థాయి అనుభవం ఆమెకు ఉందని, సామాన్య ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు.ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళా సాధికారతకు ఎన్డీఏ కూటమి పెద్దపీట వేస్తోందన్నారు. మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి 72 వార్డుల్లోనూ , 100 శాతం స్ట్రైక్ రేట్‌తో కూటమి విజయం సాధించాలని పిలుపు నిచ్చారు.మేయర్ అభ్యర్థి రేలంగి శ్రీదేవి మాట్లాడుతూ రాబోయే గోదావరి పుష్కరాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందన్నారు. నగరానికి కొత్త రూపు తీసుకురావడమే లక్ష్యమన్నారు.ఈ మీడియా సమావేశంలో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కూటమి నాయకులు యర్రా వేణు గోపాల రాయుడు, అత్తి సత్యనారాయణ, వై శ్రీను, హారిక, 72 వార్డుల కూటమి అభ్యర్థులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంగవరం మండలంలో రెండు పంచాయతీలు ఏకగ్రీవం





మిగిలిన 15 పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలకు పోటీ

ఎంపీడీవో లక్ష్మణరావు

గంగవరం, పెన్ పవర్, నవంబర్ 21 :గంగవరం మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా మొత్తం 17 గ్రామ పంచాయతీలకు గాను రెండు పంచాయతీలు ఏకగ్రీవం కాగా, మిగిలిన 15 పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలకు పోటీ నెలకొందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) లక్ష్మణరావు వెల్లడించారు. జగ్గంపాలెం గ్రామ సర్పంచిగా కోసు కన్నయ్య దొర, జియ్యంపాలెం గ్రామ సర్పంచిగా కారం సూరన్న దొర ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన తెలిపారు.వార్డు సభ్యుల స్థానాలకు సంబంధించి ఆముదాలబంద పంచాయతీలో 8, బైనపల్లిలో 4, జగ్గంపాలెంలో 3, జియ్యంపాలెంలో 8, మోహనపురంలో 7 వార్డులు ఏకగ్రీవమైనట్లు వివరించారు. మోహనపురం పంచాయతీలో నాలుగో వార్డుకు మాత్రమే పోటీ ఉందన్నారు.నెల్లిపూడి పంచాయతీలో 12 వార్డులకు గాను ఒక వార్డు ఏకగ్రీవం కాగా, మిగిలిన 11 వార్డులకు పోటీ నెలకొంది. పండ్రపోలు పంచాయతీలో 8వ వార్డు ఏకగ్రీవం కాగా, మిగిలిన ఏడు వార్డులకు అభ్యర్థులు పోటీలో ఉన్నారు. సూరంపాలెం పంచాయతీలో నాలుగు వార్డులు ఏకగ్రీవం కాగా, ఆరు వార్డులకు పోటీ కొనసాగుతోందని తెలిపారు.

ఎండపల్లి పంచాయతీలో అన్ని వార్డులకు పోటీ ఉండగా, జడేరు పంచాయతీలో 3, 4, 6వ వార్డులు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన ఏడు వార్డులకు పోటీ ఉందని పేర్కొన్నారు. మొల్లేరు, గంగవరం, పిడతమామిడి, లక్కొండ, కొత్తాడ గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యుల స్థానాలన్నింటికీ పోటీ నెలకొందని ఎంపీడీవో పి. లక్ష్మణరావు వివరించారు.

గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని అన్ని స్థానాలకు సంబంధించిన పోటీ పరిస్థితిని వెల్లడిస్తూ, ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోందని ఆయన తెలిపారు.



గ్రామ పంచాయతీ ఎన్నికలకు భారీగా నామినేషన్లు



పోలవరం జిల్లాలో సర్పంచ్ స్థానాలకు 498, వార్డు సభ్యులకు 2,002 నామినేషన్లు దాఖలు

రంపచోడవరం (పోలవరం జిల్లా బ్యూరో) పెన్ పవర్ ,నవంబర్ 21:పోలవరం జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియకు విశేష స్పందన లభించిందని జిల్లా పంచాయతీ అధికారి భాస్కరరావు తెలిపారు. జిల్లాలోని ఏడు మండలాల పరిధిలో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు మూడు రోజుల వ్యవధిలో భారీ సంఖ్యలో నామినేషన్లు దాఖలైనట్లు వెల్లడించారు.నవంబర్ 20వ తేదీ నాటికి అందిన వివరాల ప్రకారం జిల్లాలో సర్పంచ్ స్థానాలకు మొత్తం 498 నామినేషన్లు దాఖలయ్యాయి. మొదటి రోజు 18, రెండో రోజు 192, మూడో రోజు 288 నామినేషన్లు వచ్చాయి. అదేవిధంగా వార్డు సభ్యుల స్థానాలకు మొత్తం 2,002 నామినేషన్లు దాఖలయ్యాయి. మొదటి రోజు 45, రెండో రోజు 611, మూడో రోజు 1,346 నామినేషన్లు నమోదయ్యాయి.మండలాల వారీగా సర్పంచ్ స్థానాలకు మారేడమిల్లిలో 52, గుర్తేడు లో 33, వై.రామవరంలో 73, చింతూరులో 86, కూనవరంలో 76, వీఆర్ పురంలో 52, ఎటపాకలో 126 నామినేషన్లు దాఖలయ్యాయి.వార్డు సభ్యుల స్థానాలకు సంబంధించి మారేడమిల్లిలో 229, గుర్తేడు లో 127, వై.రామవరంలో 213, చింతూరులో 420, కూనవరంలో 309, వీఆర్ పురంలో 234, ఎటపాకలో 470 నామినేషన్లు దాఖలయ్యాయి.జిల్లాలో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు సంబంధించి ఎన్నికల ప్రక్రియలో ప్రజలు ఉత్సాహంగా పాల్గొంటున్నారని జిల్లా పంచాయతీ అధికారి భాస్కరరావు పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికారులు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

శంఖవరం లో పర్వత రాజబాబు సతీమణి జానకి దేవి గ్రామం సర్పంచ్ నామినేషన్...

శంఖవరం పెన్ పవర్ నవంబర్ 21:- కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని శంఖవరం గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల పోటీలో భాగంగా పర్వత జానకీ దేవి శనివారం నామినేషన్ దాఖలు చేశారు. శంఖవరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎన్నికల అధికారులకు తన నామినేషన్ పత్రాలను సమర్పించారు.శంఖవరం మండల మాజీ ఎంపీపీ పర్వత గుర్రాజు (రాజబాబు) సతీమణి అయిన జానకీ దేవి, ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ముద్రగడ గిరిబాబు ఆశీస్సులతో, గ్రామ ప్రజల సహకారంతో సర్పంచ్ అభ్యర్థిగా బరిలోకి దిగారు. ఆమె ప్రస్తుతం శంఖవరం మండల లయన్స్ క్లబ్ అధ్యక్షురాలిగా కూడా కొనసాగుతున్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, స్థానిక సమస్యల పరిష్కారం వంటి అంశాలపై దృష్టి సారిస్తూ ఆమె ఎన్నికల బరిలో నిలిచారు. నామినేషన్ దాఖలు సందర్భంగా గ్రామ ప్రజల సహకారం, ఆశీస్సులు తనకు అండగా నిలుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.శంఖవరం గ్రామంలో సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ వాతావరణం వేడెక్కుతుండగా, వివిధ పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు తమ ప్రచారానికి సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో పర్వత జానకీ దేవి నామినేషన్ దాఖలు చేయడం స్థానిక రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. పర్వత జానకి దేవి తో పాటు వార్డు సభ్యులుగా గునపర్తి అప్పలస్వామి (అపురూప్), గుద్దాటి నాగేశ్వరావు తదితర వార్డు సభ్యులు నామినేషన్ దాఖలాలు చేశారు. ఈ నామినేషన్ ప్రక్రియలో యువ నాయకులు పర్వత వివేక్, ప్రజా ప్రతినిధి పోలమాటి శాంతి భరత్, తదితరులు పాల్గొన్నారు.



“మార్పు”తో ముందడుగు

- “మార్పు” సంస్థ ద్వారా ఉచితంగా తాగునీటి చేతిపంపులు ఏర్పాటు
- మార్పు ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్ ఉందుర్తి జాన్ కుమార్



పిఠాపురం, పెన్ పవర్, నవంబర్ 21 : చేతి పంపులు ఉచితంగా పునరుద్ధరించి ఏర్పాటు ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీటిని అందించడమే తమ సంస్థ లక్ష్యమని “మార్పు” ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్ ఉందుర్తి జాన్ కుమార్ అన్నారు. పిఠాపురం పట్టణ పరిధిలోని ఇందిరానగర్, పిఠాపురం మండల పరిధిలోని చిత్రాడలో ఏర్పాటు చేసిన 3 నూతన చేతిపంపులను సంస్థ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉందుర్తి జాన్ కుమార్ మాట్లాడుతూ “మార్పు” స్వచ్ఛంద సంస్థ ద్వారా గత 31 సంవత్సరాలుగా వివిధ ప్రాంతాల్లో అనేక రకాల సేవా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో “మార్పు” స్వచ్ఛంద సంస్థ ద్వారా చేతిపంపుల పునరుద్ధరణ కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రాంతాల్లో ఉచితంగా చేతి పంపులను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రత్తిపాడు, ఏలేశ్వరం, జగ్గంపేట, గోకవరం, రంపచోడవరం, దేవీపట్నం, కిర్లంపూడి మండలాల్లో ఇప్పటివరకు 100కు పైగా చేతిపంపులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంగ్లాండ్ కు చెందిన ఫౌండేషన్ సహకారంతో “మార్పు” సంస్థ ఆధ్వర్యంలో పిఠాపురంలో 3 నూతన చేతి పంపులను పునరుద్ధరణ చేసి, ఏర్పాటు చేయడం జరిగిందని, పిఠాపురం మరియు పరిసర ప్రాంతాల్లో 10 వరకు చేతి పంపులను ఏర్పాటు చేయుటకు ఇప్పటికే కొన్ని ప్రదేశాలను గుర్తించామని, ఎక్కడైనా చేతి పంపు అవసరం ఉన్నట్లయితే తమను సంప్రదించాలని కోరారు. తమ “మార్పు” సంస్థ ద్వారా మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు ‘మన పరిసరాలు – మన పరిశుభ్రత’ అనే అవగాహన కార్యక్రమం చేపడుతున్నామన్నారు. తమ ప్రాంతాల్లో ఉచితంగా చేతిపంపులు ఏర్పాటు చేయడం పట్ల పిఠాపురం ఇందిరానగర్, చిత్రాడ ఎస్సీ కాలనీ, బీసీ కాలనీ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. మార్పు సంస్థకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు..

ర్యాలిలో కూటమి ఎన్నికల ప్రచార జోరు..... ఇంటింటి ప్రచారం

- సర్పంచ్ అభ్యర్థి మద్దూరి సంధ్యాదేవి రామకృష్ణకు మద్దతుగా రంగంలోకి కూటమి నాయకులు
- గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఓటర్లకు విజ్ఞప్తి



అత్రేయపురం పెన్ పవర్ నవంబర్ 21:మండలంలోని ర్యాలి గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారం రోజురోజుకూ వేడెక్కుతోంది. గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా కూటమి తరఫున పోటీ చేస్తున్న మద్దూరి సంధ్యాదేవి రామకృష్ణకు మద్దతుగా కూటమి నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా జగన్మోహిని కేశవ స్వామి ఆలయం వెనుక ఉన్న ఉలవల్ల వారి వీధిలో మాజీ సర్పంచ్ పేర్చర్ల పుల్లంరాజు వర్మతో కలిసి అభ్యర్థి ఇంటింటి ప్రచారం చేపట్టి ఓటర్లను కలుసుకున్నారు.గ్రామంలోని ప్రతి కుటుంబాన్ని నేరుగా కలుసుకుంటూ వారి సమస్యలు, గ్రామాభివృద్ధిపై అభిప్రాయాలను తెలుసుకుంటూ ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థికి మద్దతు తెలిపి గెలిపించాలని ప్రజలను కోరుతూ ప్రచారం నిర్వహించారు. గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజల సహకారం, ఆశీర్వాదం అవసరమని నాయకులు పేర్కొన్నారు.సర్పంచ్‌గా అవకాశం కల్పిస్తే గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తామని మద్దూరి సంధ్యాదేవి రామకృష్ణ ఓటర్లకు వివరించారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పన, పారిశుధ్య నిర్వహణ, వీధుల అభివృద్ధి, ప్రజలకు అవసరమైన సదుపాయాల మెరుగుదలకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. గ్రామ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ ర్యాలి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే తమ ప్రధాన లక్ష్యమని ప్రచారంలో పేర్కొన్నారు.మాజీ సర్పంచ్ పేర్చర్ల పుల్లంరాజు వర్మ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి సమర్థవంతమైన నాయకత్వం అవసరమని, కూటమి అభ్యర్థి మద్దూరి సంధ్యాదేవి రామకృష్ణకు ప్రజలు మద్దతు తెలిపి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కూటమి నాయకులు సమిష్టిగా కృషి చేస్తారని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చే హామీలను నెరవేర్చేందుకు కట్టుబడి ఉండే నాయకత్వాన్ని ఎన్నుకోవాలని ఓటర్లకు సూచించారు.ర్యాలి గ్రామంలో కూటమి నాయకులు ఐక్యంగా ఎన్నికల ప్రచారాన్ని కొనసాగిస్తూ అభ్యర్థి విజయానికి కృషి చేస్తున్నారు. వీధివీధి ప్రచారం ద్వారా ప్రజల్లోకి వెళ్లి గ్రామాభివృద్ధి అంశాలను వివరిస్తూ ఓటర్ల మద్దతును కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఉలవల్ల వారి వీధిలో నిర్వహించిన ప్రచారానికి స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై అభ్యర్థికి మద్దతుగా నినాదాలు చేస్తూ ప్రచారాన్ని ఉత్సాహంగా నిర్వహించారు.ఈ ప్రచార కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు పెండెం వెంకన్న, మాజీ సర్పంచ్ పేర్చర్ల పుల్లంరాజు వర్మ, స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఈనెల 25న మెగా జాబ్ మేళా

జగ్గంపేట, పెన్ పవర్, నవంబరు 21: ఈనెల 25న జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చెన్నారావు తెలిపారు. కాకినాడ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.గోపికృష్ణ మాట్లాడుతూ మెగా జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈనెల 25న ఉదయం 9గంటలకు మేళా ప్రారంభమవుతుందన్నారు. టెన్త్, ఇంటర్, డిప్లొమా, ఐటీఐ, ఏదైనా డిగ్రీ, బీటెక్, ఎంబీఏ, ఫార్మసీ, ఎంఫార్మసీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. సుమారు 14 సంస్థల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. మరిన్ని వివరాలకు 8688977277, 8247788247 నెంబర్లను సంప్రదించాలన్నారు

దేవరబంద మురుగు కాలువ దుస్థితిపై కూటమి నాయకుల ఆందోళన



- పూడికతో నిలిచిపోయిన మురుగునీటి ప్రవాహం.. కొద్దిపాటి వర్షానికే ఇళ్ల వద్దకు చేరుతున్న నీరు
- కూటమి అభ్యర్థి గెలిస్తే కాలువ అభివృద్ధికి ప్రాధాన్యత.. మాజీ సర్పంచ్ పేర్చర్ల పుల్లంరాజు వర్మ

అత్రేయపురం పెన్ పవర్ నవంబర్ 21: మండలంలోని ర్యాలి గ్రామంలో దేవరబంద మురుగు కాలువ పూడిక పేరుకుపోయి మురుగునీటి ప్రవాహం స్తంభించడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కూటమి నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలువలో పూడిక తొలగించకపోవడంతో నీరు సక్రమంగా ప్రవహించక నిలిచిపోతోందని, కొద్దిపాటి వర్షం కురిసినా మురుగునీరు ఇళ్ల పరిసర ప్రాంతాలకు చేరి ప్రజలకు అవస్థలు కలిగిస్తోందని తెలిపారు. గ్రామంలో పారిశుధ్య పరిస్థితులు రోజురోజుకూ ఆందోళనకరంగా మారుతున్నప్పటికీ సమస్య పరిష్కారానికి గత పాలకులు తగిన శ్రద్ధ చూపలేదని విమర్శించారు.గ్రామంలోని దేవరబంద మురుగు కాలువ పూడిక సమస్య ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్నప్పటికీ పట్టించుకోకపోవడంతో కాలువ పరిస్థితి మరింత అధ్వానంగా మారిందని నాయకులు పేర్కొన్నారు. మురుగునీరు ముందుకు వెళ్లేందుకు సరైన మార్గం లేకపోవడంతో కాలువ పరిసర ప్రాంతాల్లో నీరు నిలిచిపోతోందని, వర్షాలు కురిసిన సమయంలో ఇళ్ల వద్దకు నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ, మురుగు కాలువల అభివృద్ధి వంటి ప్రాథమిక సమస్యలను పరిష్కరించడంలో గత పాలకులు నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు.గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా దేవరబంద మురుగు కాలువ సమస్యను ప్రధానంగా ప్రస్తావిస్తూ కూటమి నాయకులు స్థానిక ప్రజలకు భరోసా కల్పించారు. గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థి మద్దూరి సంధ్యాదేవి రామకృష్ణ విజయం సాధించిన వెంటనే దేవరబంద మురుగు కాలువ పూడిక తొలగింపు, అభివృద్ధి పనులకు ప్రాధాన్యతనిస్తూ చర్యలు చేపడతామని కూటమి యువ నాయకులు, మాజీ సర్పంచ్ పేర్చర్ల పుల్లంరాజు వర్మ, గ్రామ టీడీపీ అధ్యక్షుడు పెండెం వెంకన్న స్పష్టం చేశారు.గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా కాలువ అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తామని తెలిపారు. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా, మురుగునీరు సజావుగా ప్రవహించేలా కాలువ పూడిక తొలగింపు, అవసరమైన మరమ్మతులు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందిస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలోని ప్రజలకు మెరుగైన పారిశుధ్య వాతావరణం కల్పించడం, నివాస ప్రాంతాల్లో మురుగునీటి సమస్యలు తలెత్తకుండా చూడటం గ్రామాభివృద్ధిలో కీలక అంశాలని పేర్కొన్నారు.ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చే హామీలు కేవలం మాటలకే పరిమితం కాకుండా, గ్రామంలో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కార్యాచరణ చేపట్టడమే నిజమైన అభివృద్ధి అని కూటమి నాయకులు పేర్కొన్నారు. ర్యాలి గ్రామంలో మురుగు కాలువల సమస్యతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలను కూడా గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. దేవరబంద కాలువ అభివృద్ధి ద్వారా గ్రామ ప్రజలకు మురుగునీటి సమస్య నుంచి ఉపశమనం కల్పించేందుకు కూటమి అభ్యర్థికి మద్దతు తెలిపి గెలిపించాలని ఓటర్లను కోరారు.
గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని, గ్రామ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసే నాయకత్వాన్ని ఎన్నుకోవాలని ప్రచారంలో విజ్ఞప్తి చేశారు. దేవరబంద మురుగు కాలువ సమస్యను ఎన్నికల ప్రచారంలో ప్రధాన అంశంగా తీసుకొని ప్రజలకు అభివృద్ధిపై భరోసా కల్పించారు.
ఈ కార్యక్రమంలో కూటమి యువ నాయకులు, మాజీ సర్పంచ్ పేర్చర్ల పుల్లంరాజు వర్మ, గ్రామ టీడీపీ అధ్యక్షుడు పెండెం వెంకన్న, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలవరం ఎడమ కాలువలో 35 లక్షల చేప పిల్లల విడుదల!



- మత్స్యకారులకు అదనపు ఆదాయం.. ప్రజలకు పోషకాహార భద్రత
- వేట్లపాలెం మత్స్య విత్తన క్షేత్రంలో తొలిసారిగా చేపల ఉత్పత్తి
- జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్

గండేపల్లి, పెన్ పవర్,నవంబరు 21:మత్స్య సంపదను పెంపొందించడంతో పాటు మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ ఎన్.ఎం. హరేందిర ప్రసాద్ పేర్కొన్నారు. ప్రపంచ మత్స్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామ పరిధిలోని పోలవరం ఎడమ కాలువలో 35 లక్షల చేప పిల్లలను ఆయన విడుదల చేశారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కాలువలో చేప పిల్లలను విడుదల చేయడం వల్ల స్థానిక ప్రజలకు ప్రోటీన్లతో కూడిన నాణ్యమైన ఆహారం అందుబాటులోకి వస్తుందని, తద్వారా పోషకాహార భద్రతకు భరోసా కలుగుతుందని తెలిపారు. అదేవిధంగా ఈ ప్రాంతంలో చేపల వేటపై ఆధారపడిన మత్స్యకారులకు అధికంగా చేపలు లభించి, అదనపు ఆదాయం సమకూరుతుందని, వారి ఆర్థిక పరిస్థితులు మెరుగుపడతాయని వివరించారు.


జిల్లాలోనే తొలిసారిగా చేపల ఉత్పత్తి

ఆంధ్రప్రదేశ్‌లోనే తొలిసారిగా కాకినాడ జిల్లాలోని వేట్లపాలెం మత్స్య విత్తన క్షేత్రంలో ఈ ఏడాది ఎఫ్ఆర్‌పీ (ఫైబర్ రీన్‌ఫోర్డ్ ప్లాస్టిక్) బ్రీడింగ్ కమ్ హ్యాచింగ్ యూనిట్లను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా నాణ్యమైన చేపల సంతానోత్పత్తి చేపట్టి చేప పిల్లల ఉత్పత్తికి అవసరమైన స్పాన్‌ను తయారు చేశారు. అనంతరం పెద్దబ్రహ్మదేవం గ్రామంలోని వానపల్లి మైనర్ ఇరిగేషన్ చెరువులో ఏర్పాటు చేసిన నర్సరీలో 250 లక్షల స్పాన్‌ను పెంచారు. వాటి నుంచి అభివృద్ధి చేసిన 35 లక్షల చేప పిల్లలను ప్రస్తుతం పోలవరం ఎడమ కాలువలో విడుదల చేసినట్లు అధికారులు వెల్లడించారు.

మత్స్యకార సంఘాలకు శిక్షణ

భవిష్యత్తులో మత్స్య సహకార సంఘాలు తమకు అవసరమైన చేప పిల్లలను స్వయంగా ఉత్పత్తి చేసుకునేలా వేట్లపాలెం మత్స్య విత్తన క్షేత్రంలో ప్రత్యేక శిక్షణ కూడా అందించినట్లు తెలిపారు. ఈ విధానం అమలులోకి వస్తే చేప పిల్లల కొనుగోలుకు అయ్యే ఖర్చు తగ్గడంతో పాటు మత్స్యకార సంఘాలు స్వయం సమృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి వి. కృష్ణారావు, మత్స్యశాఖ సహాయ సంచాలకురాలు వి. అనురాధాదేవి, గండేపల్లి ఎంపీడీవో సత్యారెడ్డి, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి నూకరాజు, రాజేంద్ర, మల్లేపల్లి మత్స్య సహకార సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట ఎం.పి.పి. అనంతలక్ష్మి తులసిని సత్కరించిన పెన్షనర్స్



అంబాజీపేట, పెన్ పవర్, నవంబర్ 21: ఇటీవల జరిగిన మండల పరిషత్ ఎన్నికలలో అంబాజీపేట ఎం.పి.పి. గా ఎన్నికైన శ్ గణపతి అనంతలక్ష్మీ తులసి రాఘవరావు ను మండల పెన్షనర్స్ అసోసియేషన్ తరపున శనివారం శాలువ, పూలమాల ల తొ సత్కరించి అభినందనలు తెలిపారు. జిల్లాలో నే మండలాన్ని అభివృద్ధి పథం లో తీసుకు రావటానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమం లో అసోసియేషన్ అసోసియేట్ అధ్యక్షులు నాగాబత్తుల నరసింహమూర్తి, ప్రధాన కార్యదర్శి అల్లు సత్యనారాయణ, కోశాధికారి గుడిమెట్ల రాజారావు, గరిమెళ్ళ సుబ్రహ్మణ్యం లు పాల్గొన్నారు.

అర్నాబ్, మురుసు తుఫాను బాధితులకు నిత్యావసర వస్తువుల సహాయము



అంబాజీపేట, పెన్ పవర్, నవంబర్, 21: పుల్లేటికుర్రు గ్రామములో అక్టోబర్ నెలలో సంభవించిన అర్నాబ్ మరియు మురుసు తుఫాను బాధితులకు రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి రివర్ సిటీ వారి సౌజన్యముతో రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి ప్రెసిడెంట్ రొటేరియన్ పుట్టా రాజేంద్ర కార్యదర్శి కల్లూరి రాంబాబు, రొటేరియన్ మంచిరాజు జితేంద్ర ఆధ్వర్యంలో పుల్లేటికుర్రు గ్రామము లోని ఇందిరా నగర్ మరియు జొన్నాడ వారి పేట లకు చెందిన 20 మంది తుఫాన్ బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు బియ్యం కిరాణా సామాగ్రి, రగ్గులు పంపిణీ చేసినారు. ఈ కార్యక్రమంలో పుల్లేటికుర్రు గ్రామ మాజీ సర్పంచి జల్లి బాల రాజు, బిఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగి, కోనసీమ రెడ్ క్రాస్ జీవిత కాల సభ్యులు బెహరా వీర హనుమంతరావు శేష శయన సాయి విద్యా సంస్థల కరస్పాండెంట్ అయ్యగారి కృష్ణ సుందర్ తదితరులు పాల్గొన్నారు

గ్రామపంచాయతీ ఎన్నికలకు తొలి రోజు 92 నామినేషన్లు.

- మండలంలో సర్పంచ్ స్థానాలకు 12, వార్డు సభ్యులకు 80 నామినేషన్లు



ఏలేశ్వరం, పెన్ పవర్, నవంబర్ 21: రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిర్వహిస్తున్న గ్రామపంచాయతీ ఎన్నికలకు తొలి రోజు మొత్తం 92 నామినేషన్లు దాఖలయ్యాయి అని ఎంపీడీవో రామరాజు వర్మ శనివారం ప్రకటించారు. మండలంలోని 12 గ్రామాల్లో సర్పంచ్ స్థానాలకు మొత్తం 12 నామినేషన్లు, వార్డు మెంబర్లకు 80 నామినేషన్లు దాఖలయ్యాయి.గ్రామాల వారీగా సర్పంచ్ స్థానాలకు పేరవరం నుంచి అత్యధికంగా 3, తిరుమాలి, మర్రివీడు నుంచి రెండేసి, సి.రాయవరం, జె.అన్నవరం, లింగంపర్తి, పెద్దనాపల్లి, సిరిపురం నుంచి ఒక్కొక్క నామినేషన్ దాఖలయ్యాయి. వార్డు సభ్యుల స్థానాలకు తిరుమాలి నుంచి అత్యధికంగా 25, పేరవరం నుంచి 16, సిరిపురం నుంచి 9, సి.రాయవరం నుంచి 8, పెద్దనాపల్లి నుంచి 7, భద్రవరం, జె.అన్నవరం, యర్రవరం నుంచి నాలుగేసి, మర్రివీడు నుంచి 2, లింగంపర్తి నుంచి ఒక నామినేషన్ దాఖలయ్యాయి. నామినేషన్లకు మరో రెండు రోజులు గడువు ఉంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

కలిసొచ్చే కాలానికి నడిచొచ్చే కొడుకు అంటే ఇదే... టీడీపీకే అధికారం, అదృష్టం!



కలిసొచ్చే కాలానికి నడిచొచ్చే కొడుకు అంటే ఇదే... టీడీపీకే అధికారం, అదృష్టం!

ఏపీ స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ కూటమి భారీ ఆధిపత్యం ప్రదర్శించింది. ఎన్నికలు జరిగిన 626 ఎంపీపీ స్థానాల్లో 583 చోట్ల విజయం సాధించింది. ఐదు మండలాల్లో ఓట్లు సమానంగా రావడంతో నిర్వహించిన లాటరీలోనూ నాలుగు చోట్ల టీడీపీ అభ్యర్థులే గెలిచారు. వైఎస్సార్‌సీపీకి ఒక్క స్థానం మాత్రమే దక్కింది. అసెంబ్లీ ఎన్నికల్లో 164 స్థానాల్లో తిరుగులేని మెజార్టీతో గెలిచి అధికారం దక్కించుకున్న టీడీపీ కూటమి, తాజా స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికారంతో పాటు అదృష్టం కూడా తనవైపే ఉందని నిరూపించుకుంది. రాష్ట్రంలో అధికార బలంతో దాదాపు 97 శాతానికి పైగా భారీ స్ట్రైక్ రేటుతో ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలను కైవసం చేసుకున్న కూటమి, పోటీ హోరాహోరీగా సాగి తై అయిన చోట్ల కూడా లాటరీలో విజేతగా నిలవడం రాజకీయ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. బలం ఉన్న చోట ఏకపక్షంగా గెలవడమే కాకుండా, విపక్షం దీటుగా నిలిచిన చోట్ల సైతం కాలం కలిసిరావడంతో పసుపు జెండా ఎగురవేసిందని అంటున్నారు.

కూటమి హవా

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 659 మండలాలకు గాను ఈ నెల 19న 626 ఎంపీపీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. మిగిలిన 33 చోట్ల వివిధ కారణాలతో వాయిదా పడ్డాయి. ఈ ఎన్నికల్లో కూటమి అసాధారణ ఆధిపత్యాన్ని కనబరిచింది. ఎన్నికలు జరిగిన 626 స్థానాల్లో ఏకంగా 583 స్థానాలను కూటమి గెలుచుకుంది. ఇందులో టీడీపీ ఒంటరిగా 534 మండలాలను తన ఖాతాలో వేసుకోగా, జనసేన 42, బీజేపీ 7 స్థానాల్లో విజయబావుటా ఎగురవేశాయి. అటు జడ్పీటీసీ స్థానాల విషయంలోనూ ఇదే తరహా రికార్డు స్థాయి స్ట్రైక్ రేటుతో కూటమి క్లీన్‌స్వీప్ చేసింది. ప్రధాన ప్రతిపక్షం వైఎస్సార్‌సీపీ కేవలం 39 ఎంపీపీ స్థానాలకే పరిమితం కాగా, స్వతంత్రులు 3, సీపీఎం 1 స్థానంలో గెలుపొందాయి.

విపక్షాన్ని వెక్కిరించిన అదృష్టం

అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత ఈ స్థానిక పోరులో కొన్ని మండలాల్లో వైఎస్సార్‌సీపీ కూటమికి గట్టి పోటీనిచ్చింది. రాష్ట్రంలోని 5 మండలాల్లో అధికార, విపక్ష పార్టీలకు సమానంగా ఓట్లు రావడంతో ఫలితం ఉత్కంఠగా మారింది. ఎన్నికల నిబంధనల ప్రకారం అధికారులు లాటరీ (లక్కీ డ్రా) తీసి విజేతలను ప్రకటించారు. హోరాహోరీగా తలపడిన ఈ ఐదు చోట్ల విపక్షం దీటుగా నిలిచినా, చివరి నిమిషంలో అదృష్టం మాత్రం వారిని వెక్కిరించింది.లాటరీ తీసిన 5 మండలాల్లో ఏకంగా 4 చోట్ల టీడీపీ అభ్యర్థులే విజేతలుగా నిలవగా, వైఎస్సార్‌సీపీ ఒక్క స్థానంతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది.లాటరీ ద్వారా విజయం వరించిన స్థానాల్లో విజయనగరం జిల్లా గుర్ల మండలం ఉంది. ఇక్కడ ఇరుపక్షాలకు సమాన బలం ఉండటంతో లాటరీ తీశారు. ఇందులో టీడీపీ అభ్యర్థి సన్యాసినాయుడు ఎంపీపీగా ఎన్నికయ్యారు. అదేవిధంగా కృష్ణా జిల్లా ఉంగుటూరులోనూ టీడీపీకి చెందిన సుజిత లక్కీ డ్రాలో విజయం సాధించారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సైదాపురంలో కూడా లాటరీ నిర్వహించారు. ఇందులో అదృష్టం టీడీపీ అభ్యర్థి పొట్టేళ్ల పార్వతిని వరించింది.అదేవిధంగా శ్రీసత్యసాయి జిల్లా ఓబుల దేవర చెరువులో కూడా టీడీపీ అభ్యర్థి పిట్టా ఓబులరెడ్డి గెలుపొందారు. ఇక వాయిదా పడిన స్థానాల జాబితాలో ఉన్న అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగూడ మండలంలోనూ ఇరువర్గాలకు చెరో 7 ఓట్లు వచ్చి తై అవ్వగా, తర్వాత నిర్వహించిన లాటరీలోనూ కూటమి అభ్యర్థి పంచాది మంజులనే అదృష్టం వరించింది.అయితే అనకాపల్లి జిల్లా మునగపాకలో మాత్రం వైసీపీకి ఊరట దక్కింది. లాటరీ జరిగిన ఆరు స్థానాల్లో వైఎస్సార్‌సీపీకి దక్కిన ఏకైక స్థానం ఇది. ఇక్కడ మొల్లేటి శంకర్ విజేతగా నిలిచారు. ఈ పరిణామాలను గమనించిన పరిశీలకులు అధికార బలంతో పాటు లక్కీ డ్రాలోనూ అదృష్టం కూటమికే వరించిందని అభివర్ణిస్తున్నారు.

నెల్లూరు రగడ: ఆనం వర్సెస్ ఎంపీ వేమిరెడ్డి మధ్యలో మంత్రి నారాయణ.. టీడీపీ పాలిటిక్స్‌లో హైటెన్షన్!



నెల్లూరు టీడీపీలో అంతర్గత విభేదాలు మరోసారి బయటపడ్డాయి. జడ్పీ చైర్మన్ ఎన్నికలో తనకు ప్రాధాన్యం ఇవ్వలేదని అసంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సమావేశం నుంచి వాకౌట్ చేశారు. ఆయనకు మద్దతుగా ఆత్మకూరు నియోజకవర్గానికి చెందిన ఆరుగురు జడ్పీటీసీలు కూడా బయటకు వెళ్లారు. అయినప్పటికీ పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి చైర్మన్‌గా ఎన్నికయ్యారు.

సింహపురి రాజకీయాల్లో అధికార తెలుగుదేశం పార్టీ (టీడీపీ) అంతర్గత విభేదాలు మరోసారి రచ్చకెక్కాయి. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పరిషత్ (జడ్పీ) చైర్మన్ ఎన్నికల వేళ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి బహిరంగంగానే అసంతృప్తిని వ్యక్తం చేస్తూ సమావేశం నుంచి వాకౌట్ చేయడం తీవ్ర చర్చనీయాంశమైంది. జిల్లాలో ఏ నిర్ణయం జరిగినా సహచర మంత్రి పొంగూరు నారాయణ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దంపతుల మాటే చెల్లుబాటు అవుతోందని, సీనియర్ మంత్రిగా ఉన్న తనకు కనీస ప్రాధాన్యత దక్కడం లేదని ఆనం వర్గం రగిలిపోతోందని చెబుతున్నారు. జడ్పీ చైర్మనుగా మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసరెడ్డిని ఎంపిక చేసినట్లు చాలా కాలం నుంచి ప్రచారం జరుగుతోంది. అయితే ఆ విషయమై ఇన్నాళ్లు మౌనంగా ఉన్న మంత్రి ఆనం సరిగ్గా చైర్మన్ ఎన్నిక రోజు నిరసన గళం విప్పడానికి కారణాలు ఏంటన్నది హాట్ టాపిక్ అవుతోంది.

శుక్రవారం నెల్లూరు జడ్పీ కార్యాలయంలో కొత్తగా ఎన్నికైన 35 మంది జడ్పీటీసీ సభ్యుల ప్రమాణస్వీకారం, అనంతరం జడ్పీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల ప్రక్రియకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ముందుగా జడ్పీటీసీ సభ్యుల ప్రమాణస్వీకారం పూర్తయిన తర్వాత, చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రకటించగానే మంత్రి ఆనం ఒక్కసారిగా తన సీటులో నుంచి లేచి సమావేశాన్ని బహిష్కరిస్తూ బయటకు వెళ్లిపోయారు. ఆయనకు మద్దతుగా ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాలకు చెందిన జడ్పీటీసీ సభ్యులు కూడా సమావేశం నుంచి వాకౌట్ చేశారు. అయితే, మంత్రి సహా ఏడుగురు సభ్యులు బహిష్కరించినప్పటికీ, మిగిలిన సభ్యులతో ఎన్నికల ప్రక్రియను కొనసాగించిన అధికారులు జడ్పీ చైర్మన్‌గా పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఎన్నికను పూర్తి చేశారు.

నెల్లూరు రాజకీయాల్లో దశాబ్దాల అనుభవం ఉన్న ఆనం కుటుంబానికి జిల్లాపై గట్టి పట్టు ఉండేది. కానీ, ప్రస్తుత రాజకీయ సమీకరణాల్లో తన ఆధిపత్యానికి గండిపడుతోందనే ఆవేదన మంత్రి ఆనంలో రానురాను పెరిగిపోతోందని చెబుతున్నారు. ముఖ్యంగా జడ్పీ చైర్మన్ అభ్యర్థి ఎంపికలో ఏకపక్ష నిర్ణయం తీసుకోవడం ఆయనను తీవ్ర మనస్తాపానికి గురిచేసిందని అంటున్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న ఆత్మకూరు నియోజకవర్గం నుంచి ఒకరిని జడ్పీ చైర్మన్ పదవికి ఆనం ప్రతిపాదించినట్లుగా చెబుతున్నారు. దీనికోసం జిల్లాలోని ఇతర ఎమ్మెల్యేలతో కలిసి వ్యూహరచన చేయడంతో పాటు, భారీగా ఖర్చు చేసేందుకు కూడా అభ్యర్థిని సిద్ధం చేశారని అంటున్నారు. కానీ, ఆనం ప్రతిపాదనను పక్కనపెట్టి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి దంపతులు ప్రతిపాదించిన పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేరును అధిష్టానం ఖరారు చేసిందని అంటున్నారు. తనను కనీసం సంప్రదించకుండా ఈ నిర్ణయం తీసుకోవడాన్ని మంత్రి ఆనం తీవ్ర అవమానంగా భావిస్తున్నట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. కేవలం జడ్పీ చైర్మన్ పదవి మాత్రమే కాకుండా, గతంలో నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అభ్యర్థి ఎంపికలోనూ మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి సిఫారసులకే అధిష్టానం మొగ్గు చూపిందని అంటున్నారు. జడ్పీ వైస్ చైర్మన్ పదవిని కూడా ఆనంకు తెలియకుండానే సర్వేపల్లి నియోజకవర్గానికి కేటాయించడంతో ఆయన అసహనం కట్టలు తెంచుకుందని చెబుతున్నారు. అంతకుముందు స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో పార్టీ బీ-ఫారంల కేటాయింపు నుంచే ఆనం వర్గానికి తగిన ప్రాధాన్యత దక్కలేదనే వాదన బలంగా వినిపించింది. తన సోదరుడి కుమారుడు ఆనం రంగమయూర్ రెడ్డికి నెల్లూరు డిప్యూటీ మేయర్ పదవి ఇప్పించుకునేందుకు, స్వయంగా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి నివాసానికి వెళ్లి అభ్యర్థించాల్సిన పరిస్థితి రావడం ఆనం వర్గీయులకు మింగుడుపడటం లేదని అంటున్నారు. జిల్లా రాజకీయాల్లో తొలి నుంచి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పెత్తనాన్ని ఆనం అంతర్గతంగా వ్యతిరేకిస్తుండగా, గతంలో జరిగిన జిల్లా అభివృద్ధి సమీక్షా కమిటీ (డీఆర్‌సీ) సమావేశాల్లోనూ వీరి మధ్య ప్రొటోకాల్, ఆధిపత్య విభేదాలు బయటపడ్డాయని అంటున్నారు. నెల్లూరు జిల్లాలో టీడీపీకి తిరుగులేని బలం ఉన్నప్పటికీ, నేతల మధ్య సమన్వయ లోపం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. కేవలం ఆనం మాత్రమే కాదు, ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్ రెడ్డి వర్గాలు కూడా జడ్పీ పీఠం విషయంలో ఎంపీ వేమిరెడ్డి వైఖరిపై అసంతృప్తితో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. జిల్లాలో ఏ నిర్ణయమైనా మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి కనుసన్నల్లోనే జరుగుతోందని, సీనియర్ నేతల అభిప్రాయాలకు విలువ లేకుండా పోతోందని కొందరు స్థానిక నేతలు లోలోపల మదనపడుతున్నారని చెబుతున్నారు.

ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డికి గట్టి భరోసా.. చంద్రబాబు ఏం చెప్పారు?!



కడప జడ్పీ చైర్మన్ పదవి విషయంలో అసంతృప్తితో ఉన్న జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఎపిసోడ్ సుఖాంతమైంది. రాజీనామా ఊహాగానాల నేపథ్యంలో సీఎం చంద్రబాబుతో భేటీ అయ్యారు. భవిష్యత్తులో నామినేటెడ్ పదవుల్లో తన కుటుంబం, అనుచరులకు ప్రాధాన్యం ఇస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు సమాచారం. గత రెండు రోజులుగా రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ రేపిన జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అసంతృప్తి ఎపిసోడ్ ఎట్టకేలకు సుఖాంతమైంది. కడప జిల్లా పరిషత్ (జడ్పీ) చైర్మన్ పీఠం విషయంలో మొదలైన వివాదం, ఎమ్మెల్యే రాజీనామా ఊహాగానాల వరకు వెళ్లింది. అయితే రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు మాధవ్ జోక్యం చేసుకుని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిని ముఖ్యమంత్రి చంద్రబాబు వద్దకు తీసుకువెళ్లారు. సీఎంతో జరిగిన భేటీలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మెత్తబడ్డారని అంటున్నారు. పొత్తుల్లో భాగంగా కడప జడ్పీని బీజేపీకి కేటాయించలేకపోయామని, మరోవిధంగా గుర్తింపునిస్తామని సీఎం భరోసా ఇచ్చినట్లు చెబుతున్నారు. కడప జడ్పీ చైర్మన్ స్థానాన్ని తన సోదరుడి కుమారుడు రాజేష్ రెడ్డికి కేటాయించాలని ఆదినారాయణరెడ్డి గట్టిగా పట్టుబట్టారు. అయితే, ఎన్డీఏ కూటమి సీట్ల సర్దుబాటులో భాగంగా ఈ పదవిని తెలుగుదేశం పార్టీకి కేటాయించడంతో ఆయన తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. ఇదే ఆగ్రహంతో శుక్రవారం జరిగిన కడప జడ్పీ చైర్మన్ ఎన్నికను బహిష్కరించిన ఆదినారాయణరెడ్డి, వెంటనే విజయవాడకు పయనమయ్యారు. దీంతో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తన పదవికి రాజీనామా చేయబోతున్నారంటూ జోరుగా ప్రచారం జరిగింది. విజయవాడలో ఆదినారాయణరెడ్డి మీడియా సమావేశం ఏర్పాటు చేస్తున్నారని, ఇందులో కీలక ప్రకటన చేస్తారని ఆయన అనుచరులు లీకులిచ్చారు. అయితే ఈ విషయంలో బీజేపీ అధిష్టానం ఆఘమేఘాలపై స్పందించింది. విజయవాడ వచ్చిన ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మీడియాతో మాట్లాడే ముందు సీఎం చంద్రబాబుతో కలిసేలా ఏర్పాట్లు చేసింది. ఇక సీఎంతో భేటీ తర్వాత ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వివాదం టీకప్పులా తుఫాన్ లా చల్లారిపోయింది. దీంతో ఎమ్మెల్యే ఆదికి సీఎం ఎలాంటి హామీ ఇచ్చారనే అంశంపై విస్తృత చర్చ జరుగుతోంది.

తరచూ అసంతృప్తి ఎందుకు?

రాజకీయంగా అత్యంత కీలకమైన కడప జిల్లాలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డికి బలమైన పట్టు ఉంది. వైసీపీ కంచుకోటగా భావించే జిల్లాలో కూటమి బలోపేతానికి ఆయన తనదైన శైలిలో పనిచేస్తున్నారు. అయితే, కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి స్థానిక సంస్థల పదవులు, నియోజకవర్గంలో అధికారుల బదిలీలు, పనుల కేటాయింపు వంటి అంశాల్లో తనకు తగిన ప్రాధాన్యం దక్కడం లేదని ఆయన తరచూ అసంతృప్తి వ్యక్తం చేస్తూ వస్తున్నారు. గతంలోనూ పలు మార్లు ఆయన చేసిన వ్యాఖ్యలు కూటమిలో చర్చనీయాంశమయ్యాయి. తాజాగా జడ్పీ పీఠం చేజారడంతో ఆయన సహనం కోల్పోయారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డిని ఎదిరించి ఆయన నియోజకవర్గంలో టీడీపీ గెలుపునకు తాను పనిచేశానని, అయినా ప్రభుత్వ పెద్దలు తనకు సరైన గౌరవం ఇవ్వడం లేదన్న ఆవేదన ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిలో రోజురోజుకు పెరిగిపోయిందని అంటున్నారు. దీంతో రాజీనామా చేయాలనే నిర్ణయానికి వచ్చినట్లుగా ఆయన సన్నిహితులు చెబుతున్నారు.

సీఎం భేటీ తర్వాత మెత్తపడటానికి కారణాలేంటి?

ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో తన సోదరులు రాజశేఖర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డిలతో కలిసి ఆదినారాయణరెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయ్యారు. అనంతరం మంత్రి నారా లోకేశ్‌తోనూ చర్చలు జరిపారు. ఎమ్మెల్యే రాజీనామా ప్రచారంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ చాకచక్యంతో పావులు కదిపారని చెబుతున్నారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిని బుజ్జగించి సీఎంతో మాట్లాడించడంతో స్పష్టమైన హామీ లభించినట్లుగా ప్రచారం జరుగుతోంది. కూటమి ధర్మం, రాష్ట్రవ్యాప్త సీట్ల సర్దుబాటు సమీకరణాల వల్లే కడప జడ్పీ స్థానాన్ని బీజేపీకి ఇవ్వలేకపోయామని చంద్రబాబు ఆయనకు నచ్చజెప్పారని అంటున్నారు. భవిష్యత్తులో నామినేటెడ్ పదవులు భర్తీ సమయంలో ఆదినారాయణరెడ్డి కుటుంబానికి, అనుచరులకు సముచిత స్థానం కల్పిస్తామని సీఎం స్పష్టమైన హామీ ఇచ్చినట్లు సమాచారం.

రాప్తాడు బాలికకు భారీ ఆర్థిక సాయం.. చికిత్సకు అయ్యే రూ.32 లక్షలు చెల్లింపు



రాప్తాడు పాఠశాలలో కరెంటు రంపంతో దాడికి గురైన పదో తరగతి బాలిక వైద్య ఖర్చుల కోసం ఏపీ ప్రభుత్వం రూ.32 లక్షలు మంజూరు చేసింది. సీఎం సహాయ నిధి నుంచి నిధులు విడుదల చేస్తూ లెటర్ ఆఫ్ క్రెడిట్ జారీ చేసింది. ప్రస్తుతం బెంగళూరులో చికిత్స పొందుతున్న బాలిక వేగంగా కోలుకుంటోంది. డిశ్చార్జ్ తర్వాత ఉచిత కౌన్సెలింగ్, పునరావాస చికిత్స అందించనున్నారు. అనంతపురం జిల్లా రాప్తాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉన్మాది దాడిలో తీవ్రంగా గాయపడిన పదో తరగతి బాలిక చికిత్సకు అయిన ఖర్చు మొత్తాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భరించింది. బాధిత కుటుంబంపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండా, వైద్య ఖర్చుల కింద రూ.32 లక్షలు చెల్లించేందుకు సంసిద్ధత వ్యక్తం చేస్తూ ప్రభుత్వం 'లెటర్ ఆఫ్ క్రెడిట్' (ఎల్ఓసీ) జారీ చేసింది. ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) నుంచి ఈ నిధులను మంజూరు చేస్తూ తాజాగా అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి.

అసలేం జరిగింది?

గత నెల 31న రాప్తాడు ఉన్నత పాఠశాలలో హేమంత్ అనే ఉన్మాది కరెంటు రంపంతో పదో తరగతి విద్యార్థినిపై విచక్షణారహితంగా దాడికి తెగబడ్డాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడి, రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతున్న బాలికను చూసి రాష్ట్రం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. విషయం తెలిసిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అత్యంత వేగంగా స్పందించింది. మెరుగైన వైద్యం కోసం బాలికను హుటాహుటిన బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రికి తరలించడంతో ఆమె ప్రాణాపాయం నుంచి బయటపడింది. నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో సుమారు 20 రోజులుగా చికిత్స పొందుతున్న బాలిక ప్రస్తుతం వేగంగా కోలుకుంటోంది.

మంత్రి నారా లోకేశ్ వ్యక్తిగత శ్రద్ధ, భరోసా

ఈ ఘటన జరిగినప్పటి నుంచి ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ బాలిక చికిత్సను వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తూ బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. బాలిక ఆరోగ్య పరిస్థితిపై బెంగళూరు మణిపాల్ ఆసుపత్రి వైద్యులతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూ, అత్యుత్తమ వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారు. ఆసుపత్రి ఖర్చుల గురించి ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని బాలిక తల్లిదండ్రులకు మంత్రి భరోసా ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారమే ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.32 లక్షలు మంజూరు చేయించి, ఆసుపత్రి యాజమాన్యానికి లెటర్ ఆఫ్ క్రెడిట్ అందించడంలో కీలక పాత్ర పోషించారు.

నిందితుడిపై కఠిన చర్యలు

మరోవైపు, ఆడబిడ్డలపై ఇటువంటి దాడులకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని స్పష్టం చేసిన ప్రభుత్వం, నిందితుడు హేమంత్‌పై కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించింది. కేసు దర్యాప్తును వేగవంతం చేసి నిందితుడికి త్వరగా శిక్ష పడేలా పోలీసు యంత్రాంగం చర్యలు చేపట్టింది.

బెంగళూరు ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత కూడా బాలిక పూర్తిస్థాయిలో కోలుకునేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ద్వారా ఆమెకు అవసరమైన కౌన్సెలింగ్, పునరావాస చికిత్సలను ఉచితంగా అందించేలా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఆపద సమయంలో ప్రభుత్వం చూపిన చొరవపై బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

పెన్ పవర్

టీమిండియా బ్యాటర్ల అరుదైన ఫీట్..

94 ఏళ్ల భారత టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఇదే తొలిసారి!

న్యూజిలాండ్‌తో టెస్టులో భారత బ్యాటర్ల అరుదైన రికార్డు

విదేశీ గడ్డపై తొలిసారి టాప్-5 బ్యాటర్లందరి నుంచీ 50కి పైగా రన్స్

సెంచరీతో మెరిసిన కేఎల్ రాహుల్, 98 పరుగుల వద్ద ఔటైన కెప్టెన్ గిల్

రాహుల్, జైస్వాల్, పడిక్కల్, గిల్, పంత్ అందరూ హాఫ్ సెంచరీ మార్క్ దాటిన వైనం



న్యూజిలాండ్‌తో జరుగుతున్న రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో భాగంగా వెల్లింగ్‌టన్‌లోని బేసిన్ రిజర్వ్ మైదానంలో టీమిండియా బ్యాటర్లు పరుగుల వరద పారించారు. తొలి టెస్టులో మొదటి ఇన్నింగ్స్ లో భారత టాప్-5 బ్యాటర్లు అందరూ 50 లేదా అంతకంటే ఎక్కువ పరుగులు చేసి చరిత్ర సృష్టించారు. భారత టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఇలా జరగడం ఇది ఐదోసారి కాగా, విదేశీ గడ్డపై ఇలాంటి ఘనత సాధించడం మాత్రం ఇదే తొలిసారి కావడం విశేషం. 94 ఏళ్ల భారత టెస్ట్ చరిత్రలో ఏ పర్యటనలోనూ ఈ ఫీట్ నమోదు కాలేదు.తొలి ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్‌ను 368 పరుగులకు ఆలౌట్ చేసిన భారత్, మూడో రోజు శనివారం ఆట ముగిసే సమయానికి 4 వికెట్ల నష్టానికి 486 పరుగుల భారీ స్కోరుతో పటిష్ఠ స్థితిలో నిలిచింది.ఈ ఇన్నింగ్స్‌లో భారత బ్యాటింగ్ లైనప్ అద్భుతంగా రాణించింది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (85), కేఎల్ రాహుల్ (136) తొలి వికెట్‌కు 130 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఆ తర్వాత వచ్చిన దేవదత్ పడిక్కల్ (80) కూడా కీలక ఇన్నింగ్స్ ఆడాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (98) తృటిలో సెంచరీ చేజార్చుకుని నిరాశగా వెనుదిరిగాడు. చివర్లో రిషభ్ పంత్ కూడా దూకుడుగా ఆడి 62 బంతుల్లో 55 పరుగులతో అజేయంగా నిలిచాడు.

కేఎల్ రాహుల్ రికార్డుల మోత

ఈ మ్యాచ్‌లో అద్భుత శతకంతో మెరిసిన కేఎల్ రాహుల్ పలు రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. న్యూజిలాండ్ గడ్డపై తన తొలి టెస్ట్ ఇన్నింగ్స్‌లోనే సెంచరీ సాధించిన మూడో భారత ఆటగాడిగా నిలిచాడు. గతంలో 1976లో సునీల్ గవాస్కర్ (116), సురీందర్ అమర్‌నాథ్ (124) ఈ ఘనత సాధించారు. అంతేకాకుండా, అన్ని సేనా (ఆఫ్రికా - సౌతాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా) దేశాల్లోనూ టెస్ట్ సెంచరీ చేసిన ఐదో భారత క్రికెటర్‌గా రాహుల్ నిలిచాడు. తన ఇన్నింగ్స్‌లో రాహుల్.. జైస్వాల్‌తో కలిసి 130 పరుగులు, పడిక్కల్‌తో కలిసి 165 పరుగుల కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు. ఈ ప్రదర్శనతో టీమిండియా ప్రస్తుతం 118 పరుగుల ఆధిక్యంతో మ్యాచ్‌పై పూర్తి పట్టు సాధించింది.

డబ్ల్యూటీసీలో సరికొత్త చరిత్ర: 3000 పరుగులతో గిల్ సరికొత్త రికార్డు.. వెంటే పంత్!

- డబ్ల్యూటీసీలో 3,000 పరుగులు సాధించిన తొలి భారతీయుడిగా గిల్
- 98 పరుగుల వద్ద ఔటై సెంచరీ చేజార్చుకున్న భారత కెప్టెన్
- 3,000 పరుగుల మార్కును దాటిన రెండో భారత బ్యాటర్‌గా రిషబ్ పంత్
- ఈ ఘనత సాధించిన ప్రపంచంలోనే తొలి వికెట్ కీపర్‌గా పంత్ రికార్డు
- 136 పరుగులతో సేనా దేశాల్లో సెంచరీలు పూర్తి చేసిన తొలి ఓపెనర్‌గా రాహుల్



భారత టెస్ట్, వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సరికొత్త చరిత్ర సృష్టించాడు. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) చరిత్రలో 3,000 పరుగుల మైలురాయిని అందుకున్న మొట్టమొదటి భారతీయ బ్యాటర్‌గా రికార్డుల్లోకెక్కాడు. న్యూజిలాండ్‌తో వెల్లింగ్టన్‌లోని బేసిన్ రిజర్వ్ వేదికగా జరుగుతున్న తొలి టెస్ట్ మూడో రోజు ఆటలో గిల్ ఈ ఘనత సాధించాడు. దూకుడుగా ఆడి 98 పరుగులు చేసిన అతడు.. గ్లెన్ ఫిలిప్స్ బౌలింగ్‌లో భారీ సిక్సర్‌తో ఈ రికార్డును చేరుకున్నాడు. అయితే కేవలం రెండు పరుగుల తేడాతో సెంచరీని చేజార్చుకున్నాడు.గిల్ రికార్డు సాధించిన కాసేపటికే స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ కూడా ఇదే మైలురాయిని అధిగమించాడు. డబ్ల్యూటీసీలో 3,000 పరుగులు పూర్తి చేసిన రెండో భారత బ్యాటర్‌గా పంత్ నిలిచాడు. అంతేకాకుండా ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ చరిత్రలో ఈ ఘనత సాధించిన ప్రపంచంలోనే తొలి వికెట్ కీపర్‌గా సరికొత్త చరిత్ర లిఖించాడు. 123వ ఓవర్‌లో బౌండరీ బాది తన 22వ టెస్ట్ హాఫ్ సెంచరీతో పాటు ఈ రికార్డును అందుకున్నాడు. వీరిద్దరి ఘనతపై బీసీసీఐ 'ఎక్స్' వేదికగా ప్రత్యేకంగా అభినందనలు తెలిపింది.ఈ మ్యాచ్‌లో భారత బ్యాటర్లు అద్భుత ప్రదర్శనతో న్యూజిలాండ్ బౌలర్లపై సంపూర్ణ ఆధిపత్యం చెలాయించారు. ఓపెనర్ కేఎల్ రాహుల్ 136 పరుగులతో భారీ సెంచరీ బాదాడు. తద్వారా సేనా (దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా) దేశాలన్నింటిలోనూ టెస్ట్ సెంచరీలు సాధించిన తొలి భారత ఓపెనర్‌గా చరిత్రకెక్కాడు. మరో ఓపెనర్ యశస్వి జైస్వాల్ 85, దేవదత్ పడిక్కల్ 80 పరుగులు చేశారు. విదేశీ గడ్డపై జరిగిన ఒక టెస్ట్ ఇన్నింగ్స్‌లో భారత్‌కు చెందిన టాప్-5 బ్యాటర్లందరూ 50కి పైగా పరుగులు చేయడం ఇదే తొలిసారి కావడం విశేషం. మూడో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 4 వికెట్లకు 486 పరుగులు చేసి, 118 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

అభిషేక్ కాదు.. అభిషేక్ భయ్యా అనండి.. ఫ్యాన్స్‌కి వైభవ్ సూర్యవంశీ స్వీట్ వార్నింగ్!



ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ 2026 టోర్నీలో నేపాల్‌పై ఘన విజయం సాధించిన ఆనందంలో ఉన్న భారత్-ఏ ఆటగాళ్లకు మైదానం వెలుపల ఒక అనుభవం ఎదురైంది. భారత యువ సంచలనం, 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ చిన్న పిల్లలతో సరదాగా ముచ్చటించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. సీనియర్ ఆటగాడు అభిషేక్ శర్మ పట్ల వైభవ్ చూపించిన గౌరవం, పిల్లలకు ఇచ్చిన క్యూట్ వార్నింగ్ క్రికెట్ అభిమానుల మనసులను గెలుచుకుంటోంది.

అభిషేక్ కాదు.. అభిషేక్ భయ్యా అని పిలవండి:

దోహా వేదికగా జరిగిన భారత్-ఏ జం నేపాల్ మ్యాచ్ ముగిసిన తర్వాత కొందరు చిన్న పిల్లలు భారత ఆటగాళ్ల ఆటోగ్రాఫ్‌ల కోసం గుమిగూడారు. పిల్లల కేకలు: ఆటగాళ్లలో అభిషేక్ శర్మ ను చూడగానే ఆ చిన్నారులు ఉత్సాహంతో అభిషేక్.. అభిషేక్ అంటూ పేరు పెట్టి గట్టిగా పిలవడం స్టార్ట్ చేశారు. వైభవ్ స్వీట్ వార్నింగ్: అక్కడే ఉన్న 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ వెంటనే స్పందిస్తూ చిరునవ్వుతో ఆ పిల్లలను హెచ్చరించాడు. పెద్దవాళ్లను అలా పేరు పెట్టి పిలవకూడదని, అభిషేక్ భయ్యా అని పిలవాలని సరదాగా చెప్పుకొచ్చాడు. ఈ క్యూట్ సంభాషణ కెమెరాలో రికార్డు కావడంతో నెటిజన్లు వైభవ్ సంస్కారాన్ని, అతడి మాటల్లోని అమాయకత్వాన్ని ప్రశంసిస్తూ కామెంట్లు చేస్తున్నారు.

దోహాలో భారత్-ఏ విజయం:

ఈ టోర్నమెంట్లో భారత్-ఏ జట్టు నేపాల్‌పై 306 రన్స్ తేడాతో రికార్డు లిస్ట్-ఏ విజయాన్ని నమోదు చేసింది. మొదట బ్యాటింగ్ చేసిన టీమిండియా -ఏ జట్టులో కెప్టెన్ తిలక్ వర్మ (107), వికెట్ కీపర్ కుమార్ కుశాగ్ర (117) అద్భుత సెంచరీలతో చెలరేగడంతో నిర్ణీత 50 ఓవర్లలో 332/9 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం 333 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన నేపాల్, భారత పేసర్లు ప్రిన్స్ యాదవ్ (5/6), హర్షిత్ రాణా (4/16) ధాటికి కేవలం 26 పరుగులకే ఆలౌటైంది.

ఒక్క లుక్ తో నిద్ర లేకుండా చేస్తున్న నిధి అగర్వాల్!





నిధి అగర్వాల్ డీప్ పర్పుల్ డిజైనర్ లెహంగా చీరలో మెరిసింది. గోల్డ్, సిల్వర్ ఎంబ్రాయిడరీ, భారీ జుంకాలు, గాజులతో సంప్రదాయ లుక్‌కు గ్లామర్ జోడించింది. ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రస్తుతం శ్రీనివాస్ గోపిశెట్టి దర్శకత్వంలో తెరకెక్కనున్న లేడీ ఓరియంటెడ్ పౌరాణిక థ్రిల్లర్‌లో నటించనుంది. అందాల నిధిని ఎప్పటికప్పుడు ఆడియన్స్ కు చూపిస్తూ నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ సెగలు పుట్టిస్తున్న నిధి అగర్వాల్ గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. భాషతో సంబంధం లేకుండా.. పలు అవకాశాలు అందుకుంటున్న ఈమె.. తన గ్లామర్ ఫోటోలతో యావత్ దేశ అభిమానులను విపరీతంగా అలరిస్తోంది. చీర కట్టులో సాంప్రదాయంగా కనిపిస్తూనే.. అటు అదే చీరకట్టులో గ్లామర్ వలకబోస్తూ కుర్ర కారుకు నిద్ర లేకుండా చేస్తోందని చెప్పవచ్చు.ఈ క్రమంలోనే ఇంస్టాగ్రామ్ వేదికగా మరో లేటెస్ట్ ఫోటోషూట్ తో ఆడియన్స్ ముందుకు వచ్చిన ఈ ముద్దుగుమ్మ.. తాజాగా షేర్ చేసిన ఫోటోలు మాత్రం అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. చీరకట్టులో కూడా ఇంత గ్లామర్ వలకబోయొచ్చా అంటూ కామెంట్లు చేస్తున్నారు. నిధి అగర్వాల్ ఇంస్టాగ్రామ్ వేదికగా షేర్ చేసిన లేటెస్ట్ ఫోటోషూట్ విషయానికి వస్తే.. డీప్ పర్పుల్ డిజైనర్ లెహంగా ధరించింది నిధి అగర్వాల్. చీర లాగా కట్టుకునే ఫ్యూజన్ లెహంగా చీర ఇది. కింది భాగంలో లెహంగాకు కుచ్చులు ఉండి, పైన చీర కొంగు స్టైల్ లో వస్తుంది. ఇక ఫ్యాబ్రిక్ విషయానికి వస్తే తేలికపాటి షిఫాన్ ఫ్యాబ్రిక్ తో దీనిని డిజైన్ చేశారు.చీర అంచున మొత్తం గోల్డ్ ,సిల్వర్ రంగుల జరీ సీక్వెన్స్, పూసల వర్క్ తో పాటు అందమైన లేస్ , కట్ వర్క్ డిజైన్ తో డిజైన్ చేశారు. ఇక చీర మధ్య భాగంలో అక్కడక్కడ చిన్న చిన్న బుట్టీలు లెహంగా అందాన్ని రెట్టింపు చేశాయి. ఇక లెహంగా కింది భాగంలో భారీ జర్దోసి, జరీ ఎంబ్రాయిడరీ వర్క్ తో డిజైన్ చేశారు.బ్లౌజ్ విషయానికి వస్తే.. చీరకి మ్యాచింగ్ గా స్వీట్ హార్ట్ నెక్ లైన్ కలిగిన హెవీ ఎంబ్రాయిడరీ బ్లౌజ్ ని ధరించింది. చేతులకు చిన్నచిన్న పూసల హ్యాంగింగ్స్ ను జోడించారు. పెద్దపెద్ద జుంకాలు ధరించిన ఈమె చేతికి బంగారు రంగు గాజులు ధరించి తన అవుట్ ఫిట్ ని ఫుల్ ఫిల్ చేసుకుంది. ఇక ఈ చీర లాంటి లెహంగాలో అందాలు ఆరబోస్తూ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంది ఈ ముద్దుగుమ్మ ఇక ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి.

నిధి అగర్వాల్ సినిమాల విషయానికి వస్తే.. హరిహర వీరమల్లు సినిమాతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈమె ది రాజాసాబ్ సినిమాతో డిజాస్టర్ ను చవిచూసింది. నిధి అగర్వాల్ ప్రస్తుత సినిమాల విషయానికి వస్తే.. శ్రీనివాస్ గోపిశెట్టి దర్శకత్వంలో.. పౌరాణిక థ్రిల్లర్ మూవీగా రాబోతున్న లేడీ ఓరియంటెడ్ చిత్రానికి ఈమె సంతకం చేసింది. ఆగస్టులో గ్రాండ్గా పూజా కార్యక్రమాలు కూడా జరిగాయి. మరి ఎప్పుడు ఆడియన్స్ ముందుకు వస్తుంది అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at H.NO: 38-4-216, MAHARANI STREET, MARRIPALEM, Visakhapatnam,Andhrapradesh-530018, Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, editorpenpower@gmail.com